KR TV

# మన క్రాంతి

ఇది వాస్తవ పత్రిక...




Published from Hyderabad, Nalgonda, Karimnagar, Warangal, Khammam, Vijayawada, Vishakhapatnam,Tirupati

సంపుటి : 01 సంచిక :67 | బుధవారం , 05 ఫిబ్రవరి 2025 | ఎడిటర్ : సందెపల్లి క్రాంతి కుమార్ | పేజీలు : 8 వెల: 3 రూ/-

## స్థానిక సంస్థల ఎన్నికల్లో
# బీసీలకు 42 శాతం సీట్లు
## బీజేపీ, బీఆర్ఎస్‌లు ఇస్తాయా?

కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన కులగణన అంశంపై తెలంగాణ అసెంబ్లీ సమావేశాల్లో అధికార, ప్రతిపక్షాల మధ్య తీవ్ర మాటల యుద్ధం నడిచింది. ఇదంతా బోగస్ సర్వే అని.. బీసీల జనాభాను బాగా తగ్గించేశారని బీజేపీ, బీఆర్ఎస్‌లు తీవ్రంగా అధికార పార్టీపై మండిపడుతున్నాయి. అయితే ఇదే సరైన లెక్క అంటూ అధికార పార్టీ కూడా గట్టిగానే కౌంటర్ ఇస్తోంది. దీంతో తెలంగాణ ప్రత్యేక శాసనసభ సమావేశాల్లో వాడీ వేడీ చర్చ జరుగుతోంది. ఈ క్రమంలోనే కులగణన, బీసీలకు రిజర్వేషన్లపై ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలను తీవ్రంగా తిప్పకొట్టిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. బీఆర్ఎస్, బీజేపీలకు అసెంబ్లీ వేదికగా సవాల్ విసిరారు. రాష్ట్రంలో రానున్న పంచాయతీ, ఎంపీటీసీ ఎన్నికల్లో తమ పార్టీ బీసీలకు 42 శాతం టికెట్లు ఇస్తుందని.. అయితే అదే సమయంలో బీజేపీ, బీఆర్ఎస్‌లు కూడా బీసీలకు టికెట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు.




## ఎస్సీ వర్గీకరణకు
# తెలంగాణ శాసనమండలి ఆమోదం




ఎస్సీ వర్గీకరణపై తెలంగాణ ప్రభుత్వం కీలక ప్రకటన చేసింది. ఎస్సీ వర్గీకరణ కమిషన్ రిపోర్ట్ ప్రకారం ఎస్సీలలో 59 ఉప కులాలను గుర్తించినట్లు తెలిపింది. ఎస్సీలను గ్రూప్–1, 2, 3గా వర్గీకరించాలని కమిషన్ సిఫారసులు చేసింది. గ్రూప్–1లోని 15 ఉపకులాల జనాభా 3.288 శాతం కాగా వీరికి 1 శాతం రిజర్వేషన్ కల్పించాలని కమిషన్ సూచించింది.

అలాగే గ్రూప్–2లోని 18 ఎస్సీ ఉపకులాల జనాభా 62.748 శాతం కాగా వీరికి 9శాతం రిజర్వేషన్, గ్రూప్–3లోని ఎస్సీ 26 ఉపకులాల జనాభా 33.963 శాతం కాగా వీరికి 5 శాతం రిజర్వేషన్ కల్పించాలని వర్గీకరణ కమిషన్ నివేదికలో పేర్కొంది. ఎస్సీ వర్గీకరణకు తెలంగాణ శాసనమండలి ఆమోదం తెలిపింది.

### ఈ రోజు చరిత్రలో నిలిచిపోతుంది
### - సీఎం రేవంత్ రెడ్డి

అసెంబ్లీ ఎస్సీ వర్గీకరణపై సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడారు. మూడు దశాబ్దాలుగా ఎస్సీ వర్గీకరణ పోరాటం జరుగుతోందన్నారు. ఇవాళ ఎస్సీ వర్గీకరణ అమలు చేయడం తన ఎంతో సంతృప్తినిస్తుందన్నారు. ఎంతోమంది సీఎంలకు రాని అవకాశం తనకు వచ్చిందన్నారు. సుప్రీంకోర్టు తీర్పు మేరకు వర్గీకరణకు శాశ్వత పరిష్కారం తీసుకురావాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని చెప్పారు. తన 20 ఏళ్ల రాజకీయ జీవితంలో ఈ రోజు ఆత్మ సంతృప్తి కలిగిందన్నారు. ఈ రోజు చరిత్రలో శాశ్వతంగా నిలిచిపోతుందని అన్నారు.

2లో

### కులగణన సర్వేలో
### కేసీఆర్ కుటుంబం వివరాలు ఇవ్వలేదు..
#### అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి

తెలంగాణ అసెంబ్లీలో నిర్వహించిన కులగణన సర్వేపై చర్చ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, ఆయన కుటుంబం, బీఆర్ఎస్ నేతలపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. రాష్ట్రంలో కులగణన సర్వే నిర్వహిస్తే.. కేసీఆర్, ఆయన కుటుంబం సహా ఆ పార్టీ నేతలు కొందరు వివరాలు ఇవ్వలేదని మండిపడ్డారు. ఈ సందర్భంగా పలువురి పేర్లను అసెంబ్లీలోనే రేవంత్ రెడ్డి చదివి వినిపించారు. బీజేపీ ఎంపీ డీకే అరుణ పేరు కూడా పేర్కొనడం గమనార్హం. వీరంతా ఎందుకు సర్వేలో వివరాలు నమోదు చేయలేదో రాష్ట్ర ప్రజలకు చెప్పాలని.. శాసనసభ వేదికగా రేవంత్ రెడ్డి నిలదీశారు.

2లో

### ఈ నివేదిక అంతా తప్పుల తడక
### మీ వాళ్ళే అంటున్నారు - కేటీఆర్



ప్రభుత్వం ప్రత్యేకంగా అసెంబ్లీ సమావేశాన్ని ఏర్పాటు చేస్తే.. 42శాతం రిజర్వేషన్ల బిల్లు పెడుతున్నరేమో అనుకున్నామని.. చివరకు ఏదో సర్వే రిపోర్ట్‌ని పెట్టారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల తారక రామారావు విమర్శించారు. అసెంబ్లీలో బీసీ కుల గణన నివేదికపై చర్చ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. 'ముఖ్యమంత్రి చారిత్రాత్మకమైన ప్రత్యేక శాసనసభ సమావేశాల్లో కామారెడ్డి డిక్లరేషన్ తరహాలో 42శాతం రిజర్వేషన్లు అమలు చేయడానికి బిల్లు ప్రవేశపెడతారేమోనని..

2లో

## ఎస్సీ వర్గీకరణను సమర్థిస్తున్నాం
### : కేటీఆర్




రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణను సమర్థిస్తున్నామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత ఎస్సీ వర్గీకరణకు మద్దతుగా అసెంబ్లీలో ఏకగ్రీవ తీర్మానం చేసి కేంద్రానికి పంపించామని కేటీఆర్ గుర్తు చేశారు. అసెంబ్లీలో ఎస్సీ వర్గీకరణపై కేటీఆర్ మాట్లాడారు.

సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుకు అనుగుణంగా రాష్ట్రం ప్రభుత్వం ఏకసభ్య కమిషన్ చేసిన సిఫారసులను సభలో ప్రవేశపెట్టింది. అయితే ఈ రోజు కాదు.. మొదటి నుంచి ప్రజాస్వామిక ఉద్యమంగా, మలిదశ ఉద్యమానికి నాయకత్వం వహించిన పార్టీగా.. బీఆర్ఎస్ పార్టీ ఎస్సీ వర్గీకరణకు సంపూర్ణ మద్దతు ఇస్తూ వచ్చింది. ఎస్సీ వర్గీకరణ విషయంలో 2001 నుంచి స్పష్టంగా ఉన్నామని కేటీఆర్ స్పష్టం చేశారు.

# తీన్మార్ మల్లన్నపై
## డీజీపీకి ఫిర్యాదు

కాంగ్రెస్ ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నపై రెడ్డి సంఘాల నేతలు మండిపడుతున్నారు. తమ కులాన్ని దూషించడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అతనిపై వెంటనే చర్యలు తీసుకోవాలంటూ డిమాండ్ చేస్తున్నారు. ఫిబ్రవరి 28న వరంగల్ వేదికగా బీసీ సభను తీన్మార్ మల్లన్న నిర్వహించిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా ఆయన రెడ్డి కులంపై తీవ్ర వ్యాఖ్యలు చేశారని, కుక్కలతో పోలుస్తూ దూషించారని ఆరోపణలు వస్తున్నాయి. మల్లన్న వ్యాఖ్యలపై రాష్ట్రవ్యాప్తంగా ఉన్న రెడ్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రెడ్డి కులాన్ని కించపరిచేలా దూషించారని, అతనిపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ వ్యాప్తంగా పలు పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదు చేస్తున్నారు.




ఈ మేరకు ఇప్పటికే హైదరాబాద్ ఉప్పల్ పోలీసులకు రెడ్డి మహిళా సంఘం నేతలు ఫిర్యాదు చేయగా.. నేడు(మంగళవారం) డీజీపీ జితేందర్ రెడ్డిని కలిసిన రెడ్డి సంఘం నేతలు మల్లన్నపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సైతం దీనిపై వెంటనే స్పందించాలని కోరారు.

# భారీ అగ్నిప్రమాదం




హైదరాబాద్‌లోని చర్లపల్లి పారిశ్రామిక వాడ ఫేజ్–2లో బుధవారం ఉదయం అగ్నిప్రమాదం సంభవించింది. ఆర్గానిక్ ఫెర్టిలైజర్ కెమికల్ కంపెనీలో తెల్లవారుజామున అకస్మాత్తుగా మంటలు అంటుకున్నాయి. దట్టమైన పొగతో మంటలు ఎగిసిపడ్డాయి. దీంతో కంపెనీలో పని చేస్తున్న కార్మికులు బయటకు పరుగులు తీశారు. మంటలు అంతకంతకు పెరగడంతో స్థానిక ప్రజలు భయాందోళనకు గురయ్యారు.మంటలు రావడాన్ని గమనించి అగ్నిమాపక సిబ్బందికి, కుషాయిగూడ పోలీసులకు సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపు అగ్ని ప్రమాదంలో సుమారు. రూ. 50 లక్షలకు పైగా ఆస్తి నష్టం జరిగినట్లు తెలుస్తోంది. దాదాపు 5 గంటలకు పైగా మంటలు ఎగిసిపడినట్లు స్థానికులు తెలిపారు. అగ్నిప్రమాదానికి గల కారణాలు ఇంకా తెలియల్సి ఉంది.

## వికసిత్ భారత్ లక్ష్యం సాధిస్తాం




రాష్ట్రపతి ప్రసంగంపై ధన్యవాద తీర్మానానికి పధ్నాలుగు సార్లు సమాధానం ఇచ్చే అదృష్ట్యాన్ని దేశ ప్రజలు తనకు ఇచ్చారని, ఇందుకు తాను ప్రజలందరికీ కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అన్నారు. పార్లమెంటు బడ్జె సమావేశాల్లో రాష్ట్రపతి చేసిన ప్రసంగంపై ధన్యవాద తీర్మానానికి లోక్‌సభలో ప్రధాని సమాధానమిస్తూ, రాష్ట్రపతి ప్రసంగం 'వికసిత్ భారత్' లక్ష్యంపై దేశ దృఢసంకల్పాన్ని పునరుద్ఘాటించిందని అన్నారు.

## నేటిమాట

పని తీరు.. గుర్తింపునకు దారి తీస్తుంది. గుర్తింపు గౌరవాన్ని తెస్తుంది. గౌరవం శక్తిని పెంచుతుంది. అధికారం దక్కిన సందర్భాల్లో వినయం, విధేయత, దయ కలిగి ఉండడం ఒక సంస్థ లేదా మనిషి పురోగతికి దారి తీస్తుంది.



**నారాయణమూర్తి,**
ఇన్ఫోసిస్ వ్యవస్థాపకుడు

# నేడే ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు

మంగళవారం ఢిల్లీలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. మొత్తం 70 అసెంబ్లీ స్థానాలకు ఒకే విడతలో పోలింగ్ నిర్వహించనున్నారు. ఈ ఎన్నికల కోసం కేంద్ర ఎన్నికల సంఘం ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తిచేసింది. ఢిల్లీలోని 70 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని మొత్తం 1.56 కోట్ల మంది ఓటర్లు రేపు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు.బుధవారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ జరుగుతుంది. ఫిబ్రవరి 8న పోలైన ఓట్లను లెక్కించి ఫలితాలను వెల్లడించనున్నారు. మొత్తం ఎన్నికల ప్రక్రియ ఫిబ్రవరి 10 తో ముగియనుంది. ఢిల్లీలోని 70 నియోజకవర్గాల్లో 58 జనరల్ సీట్లు కాగా.. మరో 12 ఎస్సీ రిజర్వ్‌డ్ సీట్లు. మొత్తం 1.56 కోట్ల మంది ఓటర్లలో 83.49 లక్షల మంది పురుష ఓటర్లు కాగా.. 71.74 లక్షల మంది మహిళా ఓటర్లు ఉన్నారు. వారిలో 20 నుంచి 29 ఏళ్ల వయస్సు గల యువ ఓటర్ల సంఖ్య 25.89 లక్షలుగా ఉంది. 18 నుంచి 19 సంవత్సరాల వయస్సు గల తొలిసారి ఓటేసే వారి సంఖ్య 2.08 లక్షలు.ఎన్నికల నేపథ్యంలో ప్రత్యేక అవసరాలు ఉన్న వారి కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు అధికారులు ప్రకటించారు.




## పవన్ కల్యాణ్‌లా తెలంగాణలో ప్యాకేజి స్టార్ పుట్టుకొచ్చాడు..



### స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం సీట్లు
# బీజేపీ, బీఆర్ఎస్‌లు ఇస్తాయా?

మొదటి పేజీ తరువాయి

కులగణన రిపోర్ట్‌ను నిన్న ఉదయం తెలంగాణ కేబినెట్ ఆమోదం పొందగా.. అనంతరం ప్రత్యేక అసెంబ్లీ సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కులగణన సర్వేపై శాసనసభలో చర్చ నిర్వహించారు. ఈ నేపథ్యంలోనే చర్చ సందర్భంగా మాట్లాడిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. చట్టబద్ధంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలి అంటే రాజ్యాంగ సవరణ జరగాలని తెలిపారు. కానీ అలా అవకాశం లేకపోతే.. పార్టీల పరంగా రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బీసీలకు 42 శాతం సీట్లు కేటాయిస్తుందని అసెంబ్లీ వేదిక నుంచి తాను మాటిస్తున్నట్లు వెల్లడించారు. ఈ విషయంలో పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ మాట తీసుకున్న తర్వాతే అసెంబ్లీకి వచ్చినట్లు పేర్కొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం సీట్లు బీసీలకు కాంగ్రెస్ పార్టీ ఇస్తుందని కుండబద్ధలు కొట్టిన సీఎం రేవంత్ రెడ్డి.. మరి బీఆర్ఎస్, బీజేపీలు కూడా బీసీలకు 42 శాతం సీట్లు ఇస్తాయా అని ప్రశ్నించారు. చట్టబద్ధంగా అవకాశం వచ్చినపుడు రిజర్వేషన్లు ఇద్దాం.. కానీ రాజకీయంగా, నైతికంగా కట్టుబడి ఈ స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం సీట్లను బలహీన వర్గాలకు సీట్లు ఇద్దామని తెలిపారు. ఇందుకు బీఆర్ఎస్, బీజేపీలు సిద్ధమా లేదా అనేది అసెంబ్లీ వేదికగా చెప్పాలని ఛాలెంజ్ చేస్తున్నట్లు ముఖ్యమంత్రి చెప్పారు.

### కులగణన సర్వేలో
# కేసీఆర్ కుటుంబం వివరాలు ఇవ్వలేదు..
### అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి

మొదటి పేజీ తరువాయి

కులగణన సర్వేపై తెలంగాణ అసెంబ్లీలో చర్చ జరగ్గా.. ప్రతిపక్ష ఎమ్మెల్యేలు చేసిన ఆరోపణలను సీఎం రేవంత్‌రెడ్డి గట్టిగా తిప్పికొట్టారు. బీఆర్ఎస్ నేతలు సర్వేలో ఎందుకు పాల్గొనలేదని నిలదీశారు. 50 రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా కులగణన సర్వే జరిగితే .. అందులో మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రులు కేటీఆర్, హరీష్ రావు, ఎమ్మెల్యేలు తీగుల్ల పద్మారావు, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, మహబూబ్‌నగర్ బీజేపీ ఎంపీ డీకే అరుణ వంటి నేతలు కూడా ఈ కులగణన సర్వేలో పాల్గొనలేదని తీవ్ర విమర్శలు చేశారు.

ఈ కులగణ సర్వేలో భాగంగా ప్రజలకు ఎంత భూమి ఉందో వివరాలు చెప్పాలని కూడా ఆ ఫామ్‌లో ఒక కాలమ్ ఉందని తెలిపిన సీఎం రేవంత్ రెడ్డి.. కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావులు ఎవరూ సమాచారం ఇవ్వలేదని మండిపడ్డారు. భూముల వివరాలు అడిగినందుకే భయపడి.. కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావు సర్వేలో పాల్గొనలేదని ఎద్దేవా చేశారు. ఈ కులగణన సర్వేలో రాష్ట్రవ్యాప్తంగా 3.54 కోట్ల మంది పాల్గొన్నారని.. చాలా మంది ఎమ్మెల్యేలు, ఎంపీలు భూముల వివరాలు ఇచ్చారని.. కానీ కొందరు మాత్రమే ఇవ్వలేదని విమర్శలు గుప్పించారు.

ఇక అదే సమయంలో గతంలో బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తొలిసారి.. రాష్ట్రంలో సమగ్ర కుటుంబ సర్వే నిర్వహించిన విషయాన్ని గుర్తు చేసిన రేవంత్.. దాని నివేదికను ఎందుకు భయటపెట్టలేదని ప్రశ్నించారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం సీట్లు తమ పార్టీ ఇస్తుందని చెప్పిన రేవంత్.. బీఆర్ఎస్, బీజేపీ సహా అన్ని పార్టీలు బీసీలకు 42 శాతం సీట్లు ఇవ్వాలని సవాల్ విసిరారు. కులగణన సర్వే సమాచారాన్ని.. రాష్ట్రంలో సంక్షేమ పథకాల విధానాల కోసం ఉపయోగిస్తామని సీఎం స్పష్టం చేశారు.

1931 నుంచి ప్రతి 10 ఏళ్లకు ఒకసారి దేశంలో జనగణన చేపట్టారని.. కానీ 2014లో నరేంద్ర మోదీ ప్రధానమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత ఇప్పటివరకు దేశంలో జనాభా లెక్కలు నిర్వహించలేదని మండిపడ్డారు. 2021లో దేశంలో జనగణన చేపట్టాల్సి ఉన్నా.. ఇన్నేళ్లుగా మోదీ సర్కార్ ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదని విమర్శలు గుప్పించారు. బలహీనవర్గాలకు హక్కులు ఇవ్వడం బీజేపీకి ఇష్టం లేదని.. వారికి ఏదైనా సాయం చేయాలనుకుంటే 2021లో లెక్కించాల్సిన జనాభాను ఇంతవరకు ప్రధాని మోదీ ఎందుకు చేయలేదని అసెంబ్లీ వేదికగా రేవంత్ రెడ్డి ప్రశ్నించారు.

# ఈ నివేదిక అంతా తప్పుల తడక
### మీ వాళ్ళే అంటున్నారు - కేటీఆర్

మొదటి పేజీ తరువాయి

ఆ బిల్లును శాసనసభలో ఆమోదింప చేసి.. చట్టబద్ధత కల్పిస్తారేమోనని రాష్ట్రవ్యాప్తంగా బలహీన వర్గాల ప్రజలు ఎదురుచూస్తున్నారు. కానీ, ముఖ్యమంత్రి లేచి నాలుగు పేర్లు చదువుతున్నారు. మీ ప్రభుత్వంపై ప్రజలకు నమ్మకం లేదు. ఎందుకంటే రేవంత్‌రెడ్డి గారు మీరే చెప్పారు' అంటూ విమర్శించారు.

## రేవంత్ ప్రసంగం యూట్యూబ్‌లో ఉంది..

'సమగ్ర కుటుంబ సర్వే జరిగినప్పుడు.. తమరిచ్చిన ఉపన్యాసం యూట్యూబ్‌లలో, అన్ని టీవీల్లో ఉంది. ఆ రోజు ఏమన్నరు ? ఆ ముఖ్యమంత్రి సర్వే పెడితే ఎవరు పడితే వాళ్లు మీ ఇంటికి వచ్చే వివరాలు అడిగితే ఇచ్చేస్తారా..? అని మాట్లాడిందే రేవంత్‌రెడ్డి. మీరు చెప్పిన మాటలనే ఎన్యుమరేటర్లకు చూపించి వివరాలు ఇవ్వమని చెప్పారు. 57 రకాల వివరాలు అడుగుతున్నరు.. ఎట్లిస్తం ? అని మీరే అన్నరు. ఎవరు పడితే వారికి ఇచ్చేస్తామా? అన్నరు. అదే చూపించి ప్రజలు అడిగారు. వాస్తవం ఏంటంటే.. సమగ్ర కుటుంబ సర్వే 2014లో జరిగింది. శాంతికుమారి, రామకృష్ణారావు, సందీప్‌కుమార్ సుల్తానియా ఉన్నారు. అప్పుడు ఉన్నది ఇదే అధికారులు.. వేరే ఎవరో లేరు. రికార్డు ప్రకారం మాట్లాడుతున్నాను. సమగ్ర కుటుంబ సర్వేను చేయించింది ప్రభుత్వమే.. చేసింది ప్రభుత్వ అధికారులే. అది ఖచ్చితంగా అఫీషియల్ డాక్యుమెంట్. అందులో ఖచ్చితంగా ఓపెన్‌గా వెబ్‌సైట్‌లోనే పెట్టాం' అన్నారు.

## బీసీల జనాభా సంఖ్య సమగ్ర సర్వేలో ఉంది..

'అసెంబ్లీలో కాదు.. చాటుమాటుగా కాదు.. పారదర్శకంగా వెబ్‌సైట్‌లో పెట్టాం. అదే పాయల్ శంకర్ వివరాలు తీసుకున్నారు. సమగ్ర కుటుంబ సర్వేలో ఏం ఉన్నది. కేసీఆర్ ప్రభుత్వానికి, కాంగ్రెస్ ప్రభుత్వానికి తేడా ఏంటంటే.. సమగ్ర కుటుంబ సర్వేలో పాల్గొన్న కుటుంబాల సంఖ్య కోటి మూడు లక్షల 95వేల కుటుంబాలు. పాల్గొన్న ప్రజలు 3.68కోట్లు. 24గంటల్లో రాష్ట్రవ్యాప్తంగా ప్రతి ఇంటిని ఎన్యుమరేట్ చేశాం. ముఖ్యమంత్రి ఎంత తప్పుదోవ పట్టిస్తున్నారంటే.. ఇంతకు మించి టాపిక్ లేదు. మా ప్రభుత్వం గతంలో చేసిన పని గురించి.. అనుమానాలు తలెత్తే విధంగా మాట్లాడరో దాని గురించి చెప్పాల్సిన అవసరం ఉంది. సీఎం బీసీల సంఖ్య అందులో ఎంత? అని అడుగుతున్నారు. ఆ నాడు బీసీల సంఖ్య సమగ్ర కుటుంబ సర్వే ప్రకారం 1,85,61,856గా ఉంది. 51శాతం బీసీలు.. అది కాకుండా ముస్లిం సామాజిక వర్గంలో ఉండే బీసీలను 10శాతం కలుపుకుంటే.. సమగ్ర కుటుంబ సర్వే ప్రకారం బీసీల సంఖ్య 61శాతం ఉండేది. శ్రీనివాస్ యాదవ్ సరిగ్గా చెప్పారు' అన్నారు.

## నివేదికను తగలబెట్టాలని కాంగ్రెస్ ఎమ్మెల్సీ చెబుతున్నడు..

'ఈ నివేదిక అంతా తప్పుల తడక అని కాంగ్రెస్ ఎమ్మెల్సీ తగలబెట్టాలని చెబుతున్నడు. రాష్ట్రవ్యాప్తంగా బలహీన వర్గాల సంఘాలు చెబుతున్నయ్. సమగ్ర కుటుంబ సర్వేలో 1.85కోట్లు ఉన్న బీసీలు ఎట్లా 1.64లక్షలకు తగ్గారు.. 51శాతం 46శాతం ఎట్లయ్యిందని అడుగుతున్నరు. శంకర్ అన్న కూడా అదే అడిగిండు.. అందులో తప్పు ఏముంది. ఆయనే కాదు.. కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ మాట్లాడుతున్నడు. మీరిచ్చిన నివేదికను తగలబెట్టాలని చెబుతున్నడు. శాసనసభ సమావేశం ప్రత్యేకంగా పెడితే.. ఇవాళ మీరేం కొత్తగా ఏం చెప్పారు. మీరు చెప్పిందే మొన్న ఉత్తమ్ కుమార్‌రెడ్డి ప్రెస్‌మీట్‌లో చెప్పారు. సబ్‌కమిటీ చైర్మన్‌గా చెప్పిన లెక్కలన్నీ.. సీఎం ఇవాళ చెప్పారు. ఎందుకు ఇవాళ సభ పెట్టారు? 42శాతం రిజర్వేషన్లు ఇచ్చేందుకు చట్టబద్ధత కల్పిస్తూ బిల్లు తెస్తారని మేం అనుకున్నాం. మీరు చెప్పినట్లు 56శాతం బీసీలు ఉంటే.. వారికి బీసీ సబ్ ప్లాన్ తెస్తరేమోనని అనుకున్నాం. ఏమీ తేకుండా.. ఇవాళ నివేదికన సభలో పెట్టామంటే.. చరిత్ర అని చెప్పుకుంటే కాదు. బీసీలకు 42శాతం రిజర్వేషన్లు ఇవ్వాల్సిందేనని' కేటీఆర్ డిమాండ్ చేశారు.

### ఎస్సీ వర్గీకరణకు
# తెలంగాణ శాసనమండలి ఆమోదం
### ఎస్సీ వర్గీకరణపై పోరాటాలు

మొదటి పేజీ తరువాయి

తెలంగాణలో కులగణన, ఎస్సీ వర్గీకరణ రిపోర్టులకు కేబినెట్ ఆమోదం తెలిపిన విషయం తెలిసిందే. అసెంబ్లీ హాలులో సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన కేబినెట్ భేటీలో ఈ రెండు అంశాలపై చర్చించారు. ఎస్సీ వర్గీకరణపై ఎప్పటి నుంచో మాదిగ, మాలలు పోరాటం చేస్తున్నారన్నారు.

దానికి అనుగుణంగానే కులవర్గీకరణ చేపట్టామన్నారు. ఎస్సీ వర్గీకరణ అంశంలో సుప్రీంకోర్టు తీర్పు, కమిషన్ నివేదిక, సబ్ కమిటీ నివేదిక ఆధారంగా ప్రభుత్వం ముందుకు వెళ్తుందన్నారు. కులగణన, ఎస్సీ వర్ణీకరణ ద్వారా 73.5 శాతం ప్రజల సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని సీఎం రేవంత్ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు.

ఎస్సీల్లోని 59 ఉపకులాలను 3 గ్రూపులుగా విభజిస్తూ ఏకసభ్య కమిషన్ సిఫారసు చేసింది. రాష్ట్రంలో మాదిగ జనాభా 32,33,642గా పేర్కొంటూ గ్రూప్-2 లో చేర్చింది. మాదిగతో పాటు చమర్, ముచి, చిందోల్లు, బైండ్ల కులాలు ఈ గ్రూపులో ఉన్నాయి.

రాష్ట్రంలో మాలల జనాభా 15,27,143గా ఉందని చెబుతూ వీరిని గ్రూప్-3లో చేర్చారు. గ్రూప్-1లో బుడ్గ జంగం, మన్నే, మాంగ్ కులాలు ఉన్నాయి.

# వికసిత్ భారత్ లక్ష్యం సాధిస్తాం

మొదటి పేజీ తరువాయి



రాష్ట్రపతి ప్రసంగం తమలో ఆత్మవిశ్వాసం నింపిందని, మరోసారి తమ ప్రభుత్వాన్ని ఎన్నుకున్నందుకు ప్రజలకు కృతజ్ఞతలని చెప్పారు.

"మనం 2025లో ఉన్నారు. ఒకరకంగా 21వ శాతాబ్దంలో 25 శాతం ముగిసిపోయింది. 20వ శతాబ్దంలో స్వాతంత్ర్యం తరువాత, 21వ శతాబ్దంలో 25 ఏళ్లలో ఏం జరిగిందనేది కాలమే చెబుతుంది. రాష్ట్రపతి ప్రసంగాన్ని జాగ్రత్తగా గమనిస్తే, రాబోయే 25 ఏళ్లలో, వికసిత్ భారత్ దిశగా ప్రజల్లో విశ్వాసం పాదుకొలపే దిశగా పనిచేయనున్నాం. వికసిత్ భారత్ లక్ష్యాన్ని రాష్ట్రపతి ప్రసంగం ప్రతిబింబించింది. సరికొత్త ధీమాను కల్పిస్తూ, సామాన్య ప్రజానీకానికి స్ఫూర్తిగా నిలిచింది" అని మోదీ అన్నారు.

## తప్పుడు హామీలివ్వం...

'గరీబీ హటోవా' నినాదంపై మాట్లాడుతూ. ప్రభుత్వం తప్పుడు హామీలు ఇవ్వదని, ప్రజలకు నిజమైన అభివృద్ధిని అందిస్తుందని ప్రధాని అన్నారు. ఇంతవరకూ పేదలుకు 4 లక్షల గృహాలు ఇచ్చామని, గతంలో మహిళలు బహిర్భూమి సిస్టమ్ లేక అవస్థలు పడవారని, ఎవరైతే అన్ని సౌకర్యాలు ఉన్నారో వారికి ఇలాంటి అవసరాలు అర్థం కావని పరోక్షంగా ప్రతిపక్ష కాంగ్రెస్‌కు చురకలు వేశారు. పేదల కోసం 12 కోట్లకు పైగా మరుగుదొడ్లు నిర్మించామని అన్నారు. గత ఐదు దశాబ్దాలుగా 25 లక్షల మంది ప్రజలను పేదరికం నుంచి బయటపడేశామని చెప్పారు. అంకితభావంతో పథకాలు అమలు చేసినప్పుడే ఇలాంటి మార్పు సంభవమని అన్నారు. పేదల గురించి ఉత్తుత్తి హామీలు తాము ఇవ్వమని, అభివృద్ధి చేసి చూపిస్తామని చెప్పారు. పేదలు, సామాన్య ప్రజలు, మధ్యతరగతి సవాళ్లను అవగాహన చేసుకుని, వాటిని అధిగమించేలా చేసేందుకు కట్టుబడి ఉంటామని చెప్పారు.

## రాహుల్, కేజ్రీకి కౌంటర్

ప్రధాని తన ప్రసంగంలో రాహుల్ గాంధీ, కేజ్రీవాల్‌పై పరోక్ష విమర్శలు గుప్పించారు. రాష్ట్రపతి ప్రసంగం బోరింగ్‌గా ఉందంటూ రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలను పరోక్షను ప్రస్తావిస్తూ, పేదల గుడిసెల్లో ఫోటో సెషన్లతో సరదాగా గడిపేవారికి పార్లమెంటులో పేదల గురించి మాట్లాడుతూ చేసే ప్రసంగాలు బోర్‌గానే ఉంటాయని అన్నారు. కొందరు నాయకులు విలాసవంతమైన షవర్లు కోరుకుంటారని, తమ ప్రభుత్వం మాత్రం ప్రతి ఇంటికి నీళ్లు ఇవ్వడంపై దృష్టిసారిస్తుందని కేజ్రీవాల్ విలాసవంతమైన శీష్ మహల్ (అద్దాల మేడ)పై పరోక్ష విమర్శలు గుప్పించారు. ఢిల్లీ నుంచి రూపాయి పంపితే గ్రామలకు 16 పైసలే చేరుతోందని గతంలో ఒక ప్రధాని వాపోయారని, ఢిల్లీ నుంచి గల్లీ వరకూ అప్పట్లో అదే పరిస్థితి ఉండేదని ప్రధాని అన్నారు. అయితే ఇప్పుడు ఢిల్లీ నుంచి రూపాయి పంపితే గ్రామానికి రూపాయి అందుతోందని, నగదు బదిలీతో నేరుగా ప్రజలకే సొమ్ము అందుతోందని వివరించారు.

# పవన్ కల్యాణ్‌లా తెలంగాణలో ప్యాకేజి స్టార్ పుట్టుకొచ్చాడు..
### తీన్మార్ మల్లన్నపై కేఏ పాల్ సెటైర్లు



ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నపై ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ తీవ్ర విమర్శలు గుప్పించారు. ఏపీలో ప్యాకేజి సార్టు పవన్ కల్యాణ్, షర్మిలాగే తెలంగాణలో చిన్నోడు ఒకడొచ్చాడని అన్నారు. అతని పేరు తీన్మార్ మల్లన్న అని చెప్పారు. మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో కేఏ పాల్ మాట్లాడుతూ.. తీన్మార్ మల్లన్నపై అనేక రౌడీ షీటర్లు ఉన్నాయని తెలిపారు.వైసీపీ ఎంపీ అయిన ఆర్.కృష్ణయ్యతో రాజీనామా చేయించకముందే.. బీజేపీ ఆయన్ను తొత్తుగా వాడుకుంటుందని చెప్పానని కేఏ పాల్ తెలిపారు. అప్పుడు జగన్ ఒక్క రూపాయి కూడా తీసుకోకుండా ఆర్.కృష్ణయ్యకు రాజ్యసభ సీటు ఇచ్చారని అన్నారు. అప్పుడు జగన్ను ఆర్. కృష్ణయ్య ప్రశంసించారని చెప్పారు. ఇప్పుడు బీజేపీ నుంచి రాజ్యసభ సీటు పొందారని విమర్శించారు. అలాగే ఏపీలో ప్యాకేజి స్టార్ పవన్ కల్యాణ్, షర్మిలలాగే తెలంగాణలో తీన్మార్ మల్లన్న వచ్చాడని అన్నారు. నేను బీసీని అని పాట పాడుతూ.. ఆర్.కృష్ణయ్యతో కలిసి 80 కోట్లు ఖర్చు పెట్టి మరీ నిన్న మీటింగ్ పెట్టాడని అన్నారు. మన బడుగు బలహీనవర్గాలను మోసం చేస్తున్నాడని మండిపడ్డారు.

ఆర్.కృష్ణయ్య మేం బిచ్చగాళ్లమా? బిచ్చగాళ్లమా అన్నాడని.. కానీ చంద్రబాబును బిచ్చం అడిగాడని.. కేసీఆర్ను అడిగాడని.. వైసీపీని అడిగాడని కేఏ పాల్ తెలిపారు. ఇప్పుడు బీజేపీ నేతలను బిచ్చం అడిగి బీసీలను తాకట్టు పెట్టాడని విమర్శించారు. ఆయన శిష్యుడే ఆర్.కృష్ణయ్య అని ఆరోపించారు. దానికి రుజువే నిన్న తెలంగాణలో జరిగిన బీసీల మీటింగ్ అని స్పష్టం చేశారు.

బీసీలారా.. 60 శాతం ఉన్న మనం అమ్ముడుపోవాలా అని కేఏ పాల్ ప్రశ్నించారు. మీకు ఎవరికీ అమ్ముడుపోని నేను ఉన్నానని స్పష్టం చేశారు. చిరంజీవిలా కాంగ్రెస్కు.. పవన్ కళ్యాణ్ లా బీజేపీ, టీడీపీకి అమ్ముడుపోలేదని తెలిపారు. ఎంత పెద్ద పదవి ఇస్తానని ఆఫర్ ఇచ్చినా సరెండర్ అవ్వలేదని బయటపెట్టారు.

# ఈ రోజు చరిత్రలో నిలిచిపోతుంది
### - సీఎం రేవంత్ రెడ్డి

మొదటి పేజీ తరువాయి



వర్గీకరణకు శాశ్వత పరిష్కారం చూపడానికి ఎస్సీ ఉపకులాల వర్గీకరణ అమలుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. అతి తక్కువ సమయంలో సంక్లిష్టమైన సమస్యకు పరిష్కారం చూపే ప్రయత్నం చేశామన్నారు. గతంలో ఎస్సీ ఉపకులాల వర్గీకరణకు అడ్జర్న్ మోషన్ ఇస్తే తనను సభ నుంచి బయటకు పంపించారని, కానీ ఈనాడు సభా నాయకుడిగా వర్గీకరణ అమలుకు సభలో నిర్ణయం తీసుకుంటున్నానన్నారు. ఈ నిర్ణయం అంబేడ్కర్ రాజ్యాంగం వల్లే సాధ్యమైందన్నారు.

# ఎస్సీ వర్గీకరణను సమర్థిస్తున్నాం : కేటీఆర్

మొదటి పేజీ తరువాయి

అస్థిత్వ ఉద్యమానికి నాయకుడిగా, ప్రజల ఆకాంక్షలను, సంపూర్ణంగా అర్థం చేసుకున్న నాయకుడిగా కేసీఆర్ ఎస్సీ వర్గీకరణకు మద్దతు ఇచ్చారు. ఆనాడు మరొక అస్థిత్వ ఉద్యమానికి నాయకత్వం వహిస్తున్న మందకృష్ణ మాదిగను తప్పకుండా ఈ సభలో గుర్తు చేసుకోవాలి. ఎస్సీ వర్గీకరణకు మద్దతుగా ఎమ్మార్పీఎస్, టీఎమ్మార్పీఎస్, ఇతర సంఘాలు, సంస్థలు, వ్యక్తులు చేసిన పోరాటానికి కేసీఆర్ అండగా నిలబడ్డారు. కానీ వర్గీకరణ విసయంలో వారు పోరాడితే మేం అడ్డుకున్నట్టు చిత్రీకరించే ప్రయత్నం చేశారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత సీఎంగా కేసీఆర్.. 2014 నవంబర్ 29న దీక్షా దివస్ సందర్భంగా ఇదే శాసనసభలో వర్గీకరణపై తీర్మానాన్ని ప్రవేశపెట్టి కేంద్రానికి పంపించారు. అవసరమైతే రాజ్యాంగ సవరణ చేసి ఎస్సీ వర్గీకరణకు నడుం బిగించండి అని ఏకగ్రీవ తీర్మానం చేసి కేంద్రానికి పంపించారు. కేవలం తీర్మానం చేసి చేతులు దులపుకోలేదు. అప్పటి ప్రధాని మోదీని కలిసి ఎస్సీ వర్గీకరణ విషయంలో ఇది మా చిత్తశుద్ధి అని తీర్మానం కాపీ నేరుగా అందజేశారు. ఈ ఘనత కేసీఆర్‌కు మాత్రమే దక్కుతుందన్నారు కేటీఆర్.

బీఆర్ అంబేద్కర్ గొప్ప మాట అన్నారు. అదేంటంటే.. సామాజిక స్వేచ్ఛ అనేది లేకపోతే చట్టం ద్వారా సంక్రమించిన హక్కు ఏదైనా వృర్థం, నిరర్థకం అని అన్నారు. ఎస్సీ వర్గీకరణ పోరాటంలో నిజాయితీని గుర్తించి ప్రతిపక్షంలో ఉన్నా.. అధికారపక్షంలో ఉన్నా ఎస్సీ వర్గీకరణకు మద్దతు ఇచ్చాం. గాంధీ భవన్ వద్ద ఎమ్మార్పీఎస్ పోరాటంలో అమరులైన కుటంబాలను కేసీఆర్ ఆదుకున్నారు. సుప్రీంకోర్టులో 10 ఏండ్ల పాటు ఇంప్లీడ్ అయి గట్టిగా వాదించారు. ఆ ప్రయత్నం మా ప్రభుత్వ హయాంలో కూడా బలంగా చేశామని కేటీఆర్ తెలిపారు.



# తీన్మార్ మల్లన్నపై డీజీపీకి ఫిర్యాదు

మొదటి పేజీ తరువాయి

ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నను కాంగ్రెస్ పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని ఆ సంఘం నేతలు డిమాండ్ చేశారు. తెలంగాణ రెడ్డి కులానికి మల్లన్న క్షమాపణలు చెప్పాలని, చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని హెచ్చరిస్తున్నారు. లేని పక్షంలో పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని రెడ్డి సంఘాల నేతలు తీన్మార్ మల్లన్నపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు

# నేడే ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు

మొదటి పేజీ తరువాయి

పీడబ్ల్యూడీ వర్గం నుంచి 79,430 మంది ఓటర్లు ఉన్నారు. ఇక 100 సంవత్సరాలు దాటిన ఓటర్ల సంఖ్య 830 గా ఉంది. 85 ఏళ్ల వయస్సు దాటిన ఓటర్లు 1.09 లక్షల మంది ఉన్నారు. ఢిల్లీలో ట్రాన్స్‌జెండర్ ఓటర్ల సంఖ్య 1,261 గా ఉంది.మొత్తం 699 మంది అభ్యర్థులు ఈ ఎన్నికల బరిలో నిలిచారు. ఈ ఎన్నికల్లో ఏ పార్టీకి ఓటరు పట్టం కట్టాడనేది ఫిబ్రవరి 8వ తేదీ.. శనివారం తెలిపోనుంది. ఇక ఈ ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో పలువురు ప్రముఖులు వివిధ అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి బరిలో దిగారు. వాటి వివరాలు..

ఫిబ్రవరి 5వ తేదీన జరగనున్న ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌లో 1.56 కోట్ల మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించు కోనున్నారు. వీరు ఓటు హక్కు వినియోగించుకోనేందుకు మొత్తం 13,766 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేశారు. ఈ ఎన్నికల్లో భద్రత కోసం 220 కంపెనీల పారా మిలటరీ దళాలు, 19 వేల మంది హెూం గార్డులు, దాదాపు 40 వేల మంది ఢిల్లీ పోలీసులను వినియోగిస్తున్నారు.

# భారీ అగ్నిప్రమాదం

ఇటీవలే పటాన్‌చెరు మండలం పాశమైలారం పారిశ్రామికవాడలోని ఓ కెమికల్ ఫ్యాక్టరీలో భారీ అగ్ని ప్రమాదం జరిగిన విషయం తెలిసిందే. కంపెనీలో పెద్ద ఎత్తున రసాయనాలు నిల్వ ఉండటంతో ఒక్కసారిగా ఫ్యాక్టరీ మొత్తానికి మంటలు వ్యాపించి పక్కనే ఉన్న ఇతర కంపెనీలకు కూడా అంటుకున్నాయి. ప్రమాదంలో ముగ్గురు కార్మికులకు తీవ్ర గాయాలు అయ్యాయి. భారీగా ఆస్తి నష్టం సంభవించింది.అయితే నగరంలోని వివిధ పారిశ్రామిక వాడల్లో జరుగుతున్న ఈ వరుస అగ్ని ప్రమాదాలతో స్థానికులు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. కంపెనీలు సరైన భద్రతా ప్రమాణాలు పాటించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.




# అసెంబ్లీలో హాట్ హాట్‌గా కులగణన చర్చ

**• కులగణనపై కేటీఆర్ VS రేవంత్**




తెలంగాణ అసెంబ్లీ సమావేశం కొనసాగుతోంది. కులగణన, ఎస్సీ వర్గీకరణ నివేదికలపై చర్చ మొదలైంది. సామాజిక, ఆర్థిక సర్వే నివేదికలు ఉభయసభల ముందుకు తీసుకొచ్చింది ప్రభుత్వం. కుల-సర్వే 2024 నివేదికను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..దేశంలో బలహీనవర్గాలకు సంబంధించి ఇప్పటి వరకు సహేతుకమైన సమాచారం లేదని, దీంతో రిజర్వేషన్లు అమలు చేసే క్రమంలో ఇబ్బందులు తలెత్తుతున్న పరిస్థితి ఉందన్నారు. 1931 తరువాత భారతదేశంలో ఇప్పటి వరకు బలహీన వర్గాల సంఖ్య ఎంతో తేల్చలేదని అన్నారు. జనాభా లెక్కల్లోనూ బలహీనవర్గాల లెక్కలు పొందుపరచలేదని, అందుకే భారత్ జోడో యాత్ర సందర్భంగా రాహుల్ గాంధీ రాష్ట్రంలో కులగణన చేస్తామని మాట ఇచ్చారని గుర్తు చేశారు. ఇచ్చిన మాట ప్రకారం రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే కులగణనపై అసెంబ్లీలో తీర్మానం చేశామన్నారు. కులగణన ప్రక్రియను పూర్తి చేసి ఇవాళ నివేదికను సభలో ప్రవేశపెట్టామని అన్నారు. ప్రతీ గ్రామంలో, తండాల్లో ఎన్యూమరేటర్లు పకడ్బందీగా వివరాలు సేకరించారని, ప్రతీ 150 ఇండ్లను ఒక యూనిట్ గా గుర్తించి ఎన్యూమరేటర్లను కేటాయించి వివరాలు సేకరించామన్నారు

## 76 వేల మంది డేటా ఎంట్రీ ఆపరేటర్లు:

కులగణన కోసం రాష్ట్రంలో 76 వేల మంది డేటా ఎంట్రీ ఆపరేటర్లు 36 రోజులు కష్టపడి ఈ నివేదికను రూపొందించారని, రూ.160 కోట్లు ఖర్చుచేసి ఒక నిర్దిష్టమైన పకడ్బందీ నివేదిక రూపొందించామని పేర్కొన్నారు. పూర్తిస్థాయి చట్టబద్ధత కల్పించేందుకు కేబినెట్ ఆమోదం తరువాత సభలో ప్రవేశపెట్టామన్నారు. 56 శాతం ఉన్న బీసీలకు సముచిత గౌరవం కల్పించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నామని, దేశానికి ఆదర్శంగా నిలిచేలా నివేదికను రూపొందించడానికి కృషి చేసిన అందరికీ అభినందనలు తెలియజేస్తున్నానని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. సర్వే నివేదికలో జనాభా లెక్కలలపై తేడాలు ఉన్నాయన్నారు.

**రాష్ట్రంలో బీసీల జనాభా కోటి 64 లక్షలు**

రాష్ట్రంలో బీసీల జనాభా కోటి 64 లక్షల 9 వేలు ఉన్నట్లు నివేదిక ద్వారా తెలుస్తోంది. సమగ్ర కుటుంబ సర్వే ప్రకారం బీసీ జనాభా 51 శాతం ఉందన్నారు. శాస్త్రీయంగా చేసిన సర్వే ప్రకారం బీసీ జనాభా పెరిగినట్లు తేలిందని సీఎం రేవంత్ అన్నారు.

**సర్వేలో కేసీఆర్,కేటీఆర్, హరీష్ రావు, పద్మారావు, డీకే అరుణ పాల్గొనలేదు**

తెలంగాణలో చేపట్టిన కులగణన సర్వేలో కేసీఆర్,కేటీఆర్, హరీష్ రావు, పద్మారావు, డీకే అరుణ పాల్గొనలేదని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. భూముల వివరాలు చెప్పాల్సి వస్తుందనే కేసీఆర్ కుటుంబం సర్వేలో పాల్గొనలేదన్నారు. బీఆర్ఎస్ చేసిన సమగ్ర కుటుంబ సర్వే అధికారిక డాక్యుమెంట్ అయితే నివేదికను ఎందుకు కేబినెట్ లో పెట్టలేదని ప్రశ్నించారు. అలాగే అసెంబ్లీలో ఎందుకు పెట్టలేదన్నారు. కాంగ్రెస్ పార్టీ స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం బీసీలకు సీట్లు ఇవ్వడానికి సిద్ధంగా ఉందని, బీజేపీ, బీఆరెస్ లు సిద్ధమా? అని సవాల్ విసిరారు.

**కులగణనపై కేటీఆర్ VS రేవంత్..**

**సర్వే వివరాలివ్వని నీకు మాట్లాడే హక్కు లేదు**

కులగణనపై చర్చ సందర్భంగా అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి వర్సెస్ మాజీ మంత్రి కేటీఆర్ మధ్య మాటల యుద్ధం జరిగింది. కులగణన లెక్కలో బీసీల సంఖ్యను తక్కువ చేసి చూపించారని కేటీఆర్ అన్నారు. 2014లో సమగ్ర సర్వే వివరాలు వెబ్ సైట్లో పెట్టామని చెప్పారు . వెబ్ సైట్లో ఉన్న రిపోర్ట్.. ఆరోజు చేసిన సమగ్ర కుటుంబ సర్వేనే అని అన్నారు.

సమగ్ర కుటుంబ సర్వే ప్రకారం బీసీల సంఖ్య 51 శాతం. ముస్లీం బీసీలు 10 శాతం కలిపితే ఆనాటి మొత్తం బీసీలు 61 శాతం. 5 శాతం బీసీలను తగ్గించారు. మీ ప్రభుత్వం మీద నమ్మకం లేదు. ప్రత్యేక మైన బిల్లు తీసుకొస్తారని మేము ఆశించాం. కుటుంబ సర్వేచేసినప్పుడు రేవంత్ పాల్గొన్నారా?. 56 శాత ఉన్న బీసీలకు సబ్ ప్లాన్ తెస్తారని ఆశించాం అని కేటీఆర్ అన్నారు.

కేటీఆర్ వ్యాఖ్యలకు సీఎం రేవంత్ రెడ్డి కౌంటర్ ఇచ్చారు. సమగ్ర కుటుంబ సర్వేను లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్ కోసం చేశారని ఫైర్ అయ్యారు. ఆనాడు సర్వేను ఊరు పేరు తెలియన వాళ్లతో చేయించారు. సర్వే రిపోర్ట్ పై ఎందుకు ఆనాడు కేబినెట్ లో చర్చించలేదు..అసెంబ్లీలో పెట్టలేదు. అర్థం పర్థం లేని మాటలతో ప్రయోజనం లేదు. కులగణన సర్వేలో పాల్గొనలేని కేటీఆర్ కు మాట్లాడే హక్కు లేదు. వాళ్లకు మైక్ ఇవ్వొద్దు..సభలో మాట్లాడే అర్హత లేదు. వీళ్లు చూపిస్తున్న రిపోర్ట్ ప్రభుత్వ వెబ్ సైట్ లో లేదు. ఆనాడు సర్వే చేసిన ఎనామ్యలేటర్లు ఎవరు?. ఒక్కరోజులోనే రాష్ట్ర మొత్తాన్ని లెక్కించారా?. సమగ్ర సర్వేను వాళ్ల రాజకీయం కోసం వాడుకుంటున్నారు. లేని పోని విమర్శలతో ఉపయోగం లేదు.

ప్రజల వ్యక్తిగత వివరాలు ఉన్నాయి కాబట్టే కులగణన రిపోర్ట్ పబ్లిక్ డొమైన్ లో పెట్టలేదు. బీసీలకు న్యాయం చేయాలని చూస్తే ఇన్ని విమర్శలా. మా సర్వేతో బీసీల జనాభా పెరిగింది. ప్రతి ఏటా జనాభా ఒక శాతం పెరుగుతుంది. ప్రభుత్వ చిత్తశుద్ధిని తప్పుబట్టాల్సిన అవసరం లేదు. రాజకీయ ప్రయోజనాల కోసం ఈ సర్వే చేయలేదని సీఎం రేవంత్ రెడ్డి కౌంటర్ ఇచ్చారు.

**సర్వే సమగ్రంగా లేదు..100 శాతంగా మళ్లీ కులగణన చేయాలి: తలసాని**

ప్రభుత్వం చేసిన కుల గణన సర్వే సమగ్రంగా లేదని..100 శాతం చేయాలని..మళ్లీ సర్వే చేయాలని డిమాండ్ చేశారు బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి తలసాని శ్రీనివాసయాదవ్. హైదరాబాద్ సిటీలో 30 శాతం కూడా సర్వే జరగలేదని.. 57 ప్రశ్నలతో జనం భయపడ్డారని.. చాలా మంది సర్వేకు వివరాలు ఇవ్వలేదన్నారు. హైదరాబాద్ సిటీలో 30 శాతం కూడా సర్వే జరగలేదని.. ఆ సమాచారం నా దగ్గర ఉందన్నారు మాజీ మంత్రి తలసాని.

100 శాతం సర్వే చేసినప్పుడే విలువ ఉంటుందని.. అలా కాకుండా 96 శాతం సర్వే అంటే.. దీనికి భవిష్యత్ లో చాలా ఇబ్బంది ఎదురయ్యే ప్రమాదం ఉందన్నారు తలసాని. కుల గణన సర్వేను చాలా సింపుల్ గా చేయాల్సిన అవసరం ఉందని.. కులం, ప్రాంతం, కుటుంబ వివరాలు వంటి కనీస సమాచారంతో సర్వే చేసినట్లయితే పూర్తి వివరాలు వస్తాయన్నారు తలసాని. అలా కాకుండా 57 అంశాలను చేర్చటం ద్వారా చాలా మంది వివరాలు చెప్పటానికి ముందుకు రాలేదని.. కుల గణన సర్వే మళ్లీ చేయాలని డిమాండ్ చేశారు తలసాని.

2011 జనాభా లెక్కలకు.. కుల గణనలోని లెక్కలకు.. ఎలక్షన్ కమిషన్ దగ్గర ఉన్న ఓటర్ల మధ్య చాలా తేడా ఉందని.. దీనిని పరిశీలించాలంటూ సభ దృష్టికి తెచ్చారాయన. బీసీ జనాభా తగ్గినట్లు ప్రచారం జరుగుతుందని.. ఈ విషయంపై ఉన్న అనుమానాలను నివృత్తి చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపైనే ఉందన్నారు. కుల గణన సర్వేకు చట్టబద్ధత ఇచ్చి.. అందుకు తగ్గట్టుగానే స్థానిక సంస్థల ఎన్నికల్లో 45 శాతం రిజర్వేషన్లు అమలు అయ్యే విధంగా చూడాలన్నారు. పార్టీల ఇష్టానుసారంగా కాకుండా.. చట్టబద్ధతతో రిజర్వేషన్లు అమలు అయ్యే విధంగా చూడాలన్నారు మాజీ మంత్రి తలసాని.

**మీ సర్వే కరెక్టా?.. ఆధార్ వివరాలు కరెక్టా..? లెక్కలు తేల్చాలి: అక్బరుద్దీన్ ఓవైసీ**

కులగణనపై తెలంగాణ అసెంబ్లీలో వాడివేడీగా చర్చ జరుగుతోంది. ఆధార్ 2023 రిపోర్ట్ ప్రకారం తెలంగాణ జనాభా 3.80 కోట్లని ఎంఐఎం ఎమ్మెల్యే అక్బరుద్దీన ఓవైసీ అన్నారు. కులగణన సర్వే కరెక్టా? ఆధార్ వివరాలు కరెక్టా? అని ప్రశ్నించారు. సర్వే రిపోర్ట్ కరెక్ట్ అయితే ఆధార్ వివరాలు తప్పని తీర్మానం చేద్దామన్నారు. ఓటర్ లిస్ట్ తప్పయితే ఆధార్ కూడా తప్పేనా?.. రాష్ట్ర వ్యాప్తంగా ఫేక్ ఆధార్ కార్డులు ఎన్ని ఉన్నాయో లెక్కలు తేలుద్దామన్నారు.. రాష్ట్రంలో ఇవాళ్టి వరకు 90 లక్షల 10 వేల రేషన్ కార్డులున్నాయని తెలిపారు అక్బరుద్దీన్ ఓవైసీ.

ఓటర్ లిస్ట్ కు సర్వే లెక్కలకు చాలా తేడా ఉంది. నాంపల్లిలో ఫేక్ ఓట్లు చాలా ఉన్నాయి. డబుల్ డబుల్ ఓట్లు ఉన్నాయి. ఏఐ టెక్నాలజీతో జీహెచ్ఎంసీలో సర్వే చేయాలి. 2011 లెక్కల ప్రకారం 51 లక్షల మంది మైనార్టీలు ఉన్నారు. ఆధార్ 2023 రిపోర్ట్ ప్రకారం తెలంగాణలో 3 కోట్ల 80 లక్షల మంది జనాభా ఉన్నారు. నేను ఒక్క ముస్లీంలకే కాదు అన్ని వర్గాలకు ప్రతినిధిని.ముస్లీంలకు ఇపుడున్న 4 శాతం రిజర్వేషన్లు మతపరమైనవి కావు. ఈ డబ్ల్యూసీ రిజర్వేషన్లు 25 శాతం పెంచాలి. అన్ని వర్గాలు ఓట్లేస్తేనే గెలిచారు. ముస్లీం మైనారిటీలు కూడా వెనుకబడిన వాళ్లే. ఏ కులమైనా మనమందరం భారతీయులం. పేదరికం తగ్గాలంటే అన్ని వర్గాలకు అవకాశం ఇవ్వాలి.

మున్సిపాలిటీలకు ఎన్నికలు ఎప్పుడు నిర్వహిస్తారో చెప్పాలి. ఆలస్యం చేయకుండా స్థానిక సంస్థలకు వెంటనే ఎన్నికలు నిర్వహించాలి. ఇప్పటికే రిజర్వేషన్లు 50 శాతం వరకు ఉన్నాయి. సర్పంచ్,ఎంపీటీసీ,జెడ్పీటీసీ ఎన్నికలు ఒకేసారి జరగాలి. స్థానిక సంస్థలపై ప్రభుత్వం ఒక ప్రకటన చేయాలి. ఫీజు రీయింబర్స్‌మెంట్ చాలా పెండింగ్ లో ఉన్నాయి.బీసీ,ఎస్సీ,మైనారిటీ స్టూడెంట్స్ చాలా ఇబ్బందులు పడుతున్నారు అని అక్బరుద్దీన్ ఓవైసీ అన్నారు.

# ప్రయాణికులకు గుడ్ న్యూస్.. త్వరలో టోల్‌ట్యాక్స్ స్మార్ట్ కార్డులు

జాతీయ రహదారులను ఉపయోగించే సాధారణ ప్రయాణికులకు గుడ్ న్యూస్ రాబోతుంది. ఈ క్రమంలో దేశవ్యాప్తంగా అన్ని టోల్ బూత్‌లలో 'మంత్లీ టోల్ ట్యాక్స్ స్మార్ట్ కార్డ్'ను కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టేందుకు యోచిస్తోంది. ఈ నిర్ణయంపై కేంద్ర రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ స్పీడుగా చర్యలు తీసుకుంటోంది. కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ఇటీవల ఈ పథకాన్ని ప్రవేశపెట్టడానికి అనుకూలంగా ఉన్నట్లు వెల్లడించారు .

**స్మార్ట్ కార్డ్ ప్రయోజనాలు :** ఈ స్మార్ట్ కార్డ్ పథకం అమలులోకి వచ్చిన తర్వాత ఈ కార్డు దేశవ్యాప్తంగా ఉన్న అన్ని టోల్ ప్లాజాల్లో చెల్లుబాటు అవుతుంది. ఈ కార్డుదారులకు టోల్ ఛార్జీలపై తగ్గింపు కల్పిస్తుందని వివిధ నివేదికలు చెబుతున్నాయి. అయితే ఈ కొత్త స్మార్ట్ కార్డు పథకం సాధారణ ప్రయాణికులకు టోల్ ఛార్జీలను తగ్గించి, వారిపై ఆర్థిక భారాన్ని భారీగా తగ్గిస్తుంది. ఇందులో ముఖ్యంగా వాణిజ్య వాహనాలు, సుదీర్ఘ ప్రయాణాలు చేసే వారికి మంచి ఉపశమనం కలగనుంది. ఈ విధానం ద్వారా సాధారణ ప్రయాణికులు, వాణిజ్య వాహనాలు, ఎక్స్‌ప్రెస్ వేలో తరచుగా ప్రయాణించే వారికి మరింత మేలు జరుగుతుంది.

**స్మార్ట్ కార్డు పరిష్కారం :** ఈ స్మార్ట్ కార్డు పథకం టోల్ చెల్లింపులను సరళీకృతం చేయడానికి అద్భుతంగా పనిచేస్తుందని నిపుణులు చెబుతున్నారు. ప్రత్యేకంగా వాణిజ్య వాహనాలు, తరచుగా ప్రయాణించే వాహనాలు, ఎక్స్‌ప్రెస్‌వేలపై గడిపే ట్రాకింగ్ చేసిన వాహనాలు ఈ పథకంలో ప్రయోజనాలు పొందుతాయని అంచనా వేస్తున్నారు. టోల్ వ్యాప్తిలో ఉన్న సమస్యలు తగ్గించడానికి ఈ కార్డు ప్రభావవంతంగా పనిచేస్తుందని భావిస్తున్నారు.

**పథకం లక్ష్యం :** ఈ స్మార్ట్ కార్డు పథకంతో ప్రయాణికులు త్వరగా, సులభంగా టోల్ చెల్లింపులు నిర్వహించుకోగలుగుతారు. ముఖ్యంగా దీని ద్వారా జాతీయ రహదారులపై ప్రయాణించే వారు ఈ పథకం వల్ల ఎక్కువ ప్రయోజనాలు పొందవచ్చు. ఆర్థిక భారం తగ్గడంతోపాటు సరళమైన చెల్లింపు వ్యవస్థలు కల్పించడమే ఈ కార్డ్ లక్ష్యం.

**ప్రస్తుత టోల్ విధానం :** ప్రస్తుతం టోల్ చెల్లింపులు అనేక రకాలు ఉండగా సాధారణ ప్రయాణికులు, వాణిజ్య వాహనాలు, ఎక్స్‌ప్రెస్ వే ప్రయాణికులకు ప్రత్యేక రుసుముల విధానం ఉంది. ఇందులో నెలవారీ పాస్ తీసుకునే ప్రయాణికులకు తగ్గింపు, తక్కువ రుసుములు చెల్లించవలసిన అవకాశం ఉంటుంది. ఈ కొత్త స్మార్ట్ కార్డ్ పథకం ప్రవేశపెడతే, ప్రతి ప్రయాణికుడు ఈ స్మార్ట్ కార్డు ఉపయోగించి టోల్ చెల్లింపులు సులభంగా చేసుకునే ఛాన్స్ ఉంటుంది.

**GNSS ఆధారిత టోల్ వ్యవస్థ :** కేంద్ర ప్రభుత్వం, GNSS (Global Navigation Satellite System) ఆధారిత టోల్ వసూలు విధానాన్ని దీనికి లింక్ చేయనున్నట్లు తెలుస్తోంది. ఇది వాహనాల వేగం, మార్గం, దూరం ఆధారంగా టోల్ వసూలు వ్యవస్థను మరింత సమర్థవంతంగా అమలు చేస్తుంది. ఈ GNSS వ్యవస్థ వాహనాలలో చిన్న పరికరాలు ఉపయోగించి పనితీరు మెరుగుపరచేలా చేస్తారు.




# వేసవిలో త్రాగు నీటి సమస్య లేకుండా చూడాలి

**జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్.**




భద్రాద్రి కొత్తగూడెం:వేసవి లో తాగునీటి సరఫరాలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక చేపట్టాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అధికారులను ఆదేశించారు. రానున్న వేసవిలో ప్రజలు త్రాగునీటికి ఇబ్బంది పడకుండా పది రోజుల ప్రత్యేక కార్యచరణ ద్వారా త్రాగునీటి సరఫరా లో సమస్యలను పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మిషన్ భగీరథ ఈ ఈ తిరుమలేష్ ను ప్రత్యేక డ్రైవ్‌పై మండల స్థాయి సమావేశాలను నిర్వహించి, రోజు వారీ షెడ్యూల్‌ను రూపొందించి మండల బృందాలను ఏర్పాటు చెయ్యాలని ఆదేశించారు.మండల స్థాయిలో ఎంపీడీవో, మిషన్ భగీరథ ఏ ఈ మరియు పంచాయతీ సెక్రెటరీ లు కలిసి క్షేత్రస్థాయిలో పర్యటించి ఎక్కడైతే త్రాగునీటి సరఫరా లో సమస్యలు ఉన్నాయో వాటిని గుర్తించి వెంటనే పరిష్కరించి తద్వారా వేసవిలో త్రాగునీటి సరఫరాకు ఇబ్బంది లేకుండా చూడాలని ఆదేశించారు. అవసరమైన చోట చేతి పంపులు, బోరు మోటార్లు, పైప్ లైన్ల మరమ్మతులు వంటివి సకాలంలో చేపట్టి నీటి సరఫరాను పునరుద్ధరించాలన్నారు. అందుబాటులో ఉన్న అన్ని వనరులను పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని, నీటి ఎద్దడి కారణంగా ప్రజలు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకూడదన్నారు . అన్ని మరమ్మత్తులు మరియు సమస్యలను పరిష్కరించి రానున్న వేసవిలో త్రాగునీటి సరఫరాకు అంతరాయం లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు.ప్రజలు తమ గ్రామాలలో త్రాగు నీటి సమస్య లను టోల్ ఫ్రీ నంబర్ 18005994007 ద్వారా తెలియపరచడం ద్వారా పరిష్కరింపబడతాయని కలెక్టర్ తెలిపారు.

# గంటల్లో పోలింగ్.. ఢిల్లీ సీఎంపై ఎఫ్ఐఆర్..



మరికొద్ది గంటల్లో ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ప్రారంభం కానుంది. అలాంటి వేళ ఢిల్లీ సీఎం, ఆప్ ఎమ్మెల్యే అతిషిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఆమె కల్కాజీ అసెంబ్లీ స్థానం నుంచి బరిలో దిగారు. ఈ నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి( మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్)ని అతిక్రమించారంటూ ఆమెపై ఢిల్లీ పోలీసులు కేసు నమోదు చేశారు. స్థానిక గోవిందపూరి పోలీస్ స్టేషన్ లో ఢిల్లీ సీఎం అతిషిపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు పోలీసులు వెల్లడించారు. ఈ కేసు దర్యాప్తు కొనసాగుతోందని పోలీస్ ఉన్నతాధికారి స్పష్టం చేశారు.

ఫతే సింగ్ మార్గ్‌లో ఆప్ అభ్యర్థి అతిషి 50 నుంచి 70 మంది మద్దతుదారులతోపాటు 10 వాహనాలతో కనిపించడంతో.. ఈ చర్యలు తీసుకున్నట్లు పోలీస్ ఉన్నతాధికారి వివరించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి మార్గదర్శకాలను అనుసరించి ఆ ప్రాంత్రాన్ని ఖాళీ చేయాలని వారిని పోలీసులు అదేశించారు. కానీ ఆ అధికారిని.. తన విధులు నిర్వర్తించకుండా అడ్డుకున్నారని తెలిపారు. మరోవైపు సీఎం అతిషి తన ఎక్స్ ఖాతా వేదికగా స్పందించారు. బీజేపీ అభ్యర్థి రమేష్ బిధురితోపాటు వాళ్ల కుటుంబ సభ్యుల బహిరంగంగా దాడులకు దిగుతున్నారని విమర్శించారు. వీరిపై ఎన్నికల సంఘం ఎలాంటి చర్యలు చేపట్టదన్నారు. ఆ క్రమంలో ఎన్నికల కమిషన్‌పై ఆమె విమర్శలు గుప్పించారు.

బుధవారం జరిగే ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌లో 1.56 కోట్ల మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. వారిలో 83.76 లక్షల మంది పురుషులు, 72.36 లక్షల మంది మహిళలతోపాటు 1267 మంది థర్డ్ జండర్‌లు ఉన్నారని ఎన్నికల సంఘం వివరించింది. వీరు ఓటు హక్కు వినియోంచుకోనేందుకు 13,766 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేసినట్లు ఈసీ వెల్లడించింది. ఈ ఎన్నికల్లో భద్రత కోసం 220 కంపెనీల పారామిలటరీ ఫోర్స్, 19 వేల మంది హెూం గార్డులు, దాదాపు 40 వేల మంది ఢిల్లీ పోలీసులను వినియోగిస్తున్నట్లు తెలిపింది.

ఈ అసెంబ్లీ ఎన్నికల్లో ప్రధాన పోరు బీజేపీ, ఆప్, కాంగ్రెస్ పార్టీల మధ్య ఉండనుంది. ఈ ఎన్నికల్లో వరుసగా ఆప్ విజయం సాధిస్తూ వస్తోంది. అయితే ఈ ఎన్నికల్లో ఆప్ పాలనకు గండి కొట్టాలని బీజేపీ ప్రయత్నిస్తోంది. మరోవైపు ఈ ఎన్నికల్లో సైతం మళ్లీ గెలిచి ఢిల్లీ పీఠాన్ని కైవసం చేసుకోవాలని ఆప్ భావిస్తోంది. ఎవరికి ఈ ఢిల్లీ పీఠం కడతారనేది తెలియాలంటే మాత్రం ఫిబ్రవరి 8వ తేదీ వరకు వేచి ఉండాల్సిందే. ఎందుకంటే ఆ రోజు ఎన్నికల ఫలితాలు వెలువడనున్నాయి.



# ఉచితంగా క్యాన్సర్ పరీక్షలు..

### ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం..





ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. క్యాన్సర్ బాధితులను తొలిదశలోనే గుర్తించి, చికిత్స అందించేందుకు చర్యలు చేపడుతోంది. ఈ క్రమంలోనే బ్రెస్ట్, సర్వైకల్, ఓరల్ క్యాన్సర్ గుర్తించేందుకు.. క్యాన్సర్ పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తున్నారు. ఏపీ వైద్యారోగ్య శాఖ అధ్వర్యంలో ఈ కార్యక్రమం సాగుతోంది. ఉచిత క్యాన్సర్ పరీక్షల కోసం రాష్ట్రవ్యాప్తంగా 1500 బృందాలను ఏర్పాటు చేసినట్లు ఏపీ వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. ఈ 1500 బృందాలలో.. 155 మంది సూపర్ స్పెషలిస్టులతో పాటుగా 238 మంది స్పెషలిస్టులు, 4000 ఏఎన్ఎంలు, మరో 4000 మంది వైద్యాధికారులు ఉంటారని తెలిపారు. వీరితో పాటుగా సుమారుగా 18 వేలమంది ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బందితో ఈ క్యాన్సర్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు వివరించారు.

తిరుపతిలో మంగళవారం విలేకర్లతో మాట్లాడిన ఏపీ ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఈ వివరాలను వెల్లడించారు. క్యాన్సర్ వ్యాధి మీద అవగాహన లేకపోవటంతో ఎక్కువ మంది మృత్యువాత పడుతున్నారని సత్యకుమార్ అన్నారు. క్యాన్సర్ వ్యాధిని సరైన సమయంలో గుర్తించి చికిత్స తీసుకుంటే ఆ వ్యాధి నుంచి బయటపడే అవకాశం ఉందన్నారు. ఇందుకోసం రాష్ట్రవ్యాప్తంగా ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య కేంద్రాల్లో క్యాన్సర్ ప్రాథమిక పరీక్షలను ఉచితంగా నిర్వహిస్తున్నట్లు మంత్రి వివరించారు. ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా ఇప్పటి వరకూ 71 లక్షల మందికి పరీక్షలు చేస్తే.. 66 వేల మందిలో లక్షణాలు గుర్తించినట్లు తెలిపారు. క్యాన్సర్ లక్షణాలు గుర్తించిన వారిలో ఎక్కువ మంది గొంతు క్యాన్సర్ బాధితులు ఉన్నట్లు వివరించారు.

లక్షణాలు గుర్తించిన వారిని బోధనాసుపత్రులలోని ప్రివెంటివ్ ఆంకాలజీ యూనిట్లకు పంపుతామని.. అక్కడ మరోసారి పరీక్షలు చేసి క్యాన్సర్ ఏ దశలో ఉందో గుర్తిస్తామన్నారు. ప్రివెంటివ్ ఆంకాలజీ యూనిట్ల వద్ద రద్దీ లేకుండా ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఇందుకోసం ప్రతి మంగళవారం, గురువారం గ్రీన్ ఛానల్ ఏర్పాటు చేశామని ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. ఆరోగ్య శాఖ సిబ్బంది ఇంటి వద్దకే వచ్చి పరీక్షలు చేస్తారని.. పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. క్యాన్సర్ బాధితుల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్కువ ధరకే ఔషధాలు అందిస్తున్నాయని వివరించారు.

## ఎమ్ఆర్ఐ స్కానింగ్ కోసం వెళ్తే..

# ప్రాణమే పోయింది..

### ఈ జాగ్రత్తలు లేకనే!



ఏలూరు జిల్లాలో దారుణ ఘటన చోటుచేసుకుంది. డయాగ్నోస్టిక్ సిబ్బంది నిర్లక్ష్యం ఓ నిండు ప్రాణాన్ని బలితీసుకుంది. ఎమ్ఆర్ఐ స్కానింగ్ కోసం వచ్చిన ఓ మహిళ.. సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా ప్రాణాలు కోల్పోయింది. దీంతో బంధువులు డయాగ్నోస్టిక్ కేంద్రం వద్ద ఆందోళనకు దిగారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాల్లోకి వెళ్తే... ఏలూరు నగరంలోని రామచంద్రరావుపేటలో సుస్మిత డయాగ్నోస్టిక్ సెంటర్ ఉంది. ఎమ్ఆర్ఐ స్కానింగ్ కోసం ఏలూరు రూరల్ మండలం ప్రతికోళ్లంకకు చెందిన రామతులసమ్మ అనే మహిళ వచ్చింది. రామతులసమ్మ గత కొన్నిరోజులుగా ఆయుష్ ఆస్పత్రిలో డయాలసిస్ చేయించుకుంటున్నారు.

అయితే ఎమ్ఆర్ఐ స్కాన్ తీయించుకోవాలని అక్కడి డాక్టర్ సూచించడంతో.. రామతులసమ్మ ఎంఆర్ఐ స్కానింగ్ కోసం సుస్మిత డయాగ్నోస్టిక్ కేంద్రానికి వచ్చారు. కానీ.. డయాగ్నోస్టిక్ సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా ప్రాణాలు కోల్పోయారు. రామతులసమ్మకు గతంలో పేస్ మేకర్ అమర్చారు. అయితే ఎమ్ఆర్ఐ స్కానింగ్ సమయంలో మెటల్ డిటెక్టర్ సాయంతో రామతులసమ్మను చెక్ చేయలేదు డయాగ్నోస్టిక్ సిబ్బంది. నేరుగా స్కానింగ్ మెషీన్‌లోకి పంపించారు. అయితే మెషీన్‌లోని వెళ్లిన వెంటనే ఎమ్ఆర్ఐ స్కాన్ రేడియేషన్ ప్రభావంతో రామతులసమ్మ విలవిల్లాడిపోయారు. మెషీన్‌లోనే కొట్టుమిట్టాడుతూ కన్నుమూశారు.

ఎమ్ఆర్ఐ స్కానింగ్ రేడియేషన్ కారణంగా పేస్ మేకర్ ఊడిపోయి రామతులసమ్మ మరణించినట్లు తెలుస్తోంది. కానీ కార్డియాక్ అరెస్ట్ కారణంగా రామతులసమ్మ చనిపోయినట్లు స్కానింగ్ సెంటర్ సిబ్బంది చెప్తున్నారు. ఈ నేపథ్యంలో రామతులసమ్మ భర్త కోటేశ్వరరావు డయాగ్నోస్టిక్ కేంద్రం వద్ద ఆందోళనకు దిగారు. స్కానింగ్ మెషీన్‌లో తన భార్య ఉక్కిబిక్కిరి అవుతున్న విషయాన్ని గుర్తించి.. స్కానింగ్ ఆపాలని సిబ్బందిని కోరినట్లు ఆయన చెప్తున్నారు. కానీ డయాగ్నోస్టిక్ సిబ్బంది పట్టించుకోలేదని... చివరకు తన భార్య రేడియేషన్ తట్టుకోలేక చనిపోయిందంటూ ఆయన వాపోయారు. డయాగ్నోస్టిక్ సిబ్బంది నిర్లక్ష్యం కారణంగానే తన భార్య చనిపోయిందంటూ ఆందోళనకు దిగారు.

సాధారణంగా ఎమ్ఆర్ఐ స్కానింగ్ కోసం వచ్చిన వారి శరీరంపై ఎలాంటి మెటల్ వస్తువులు లేకుండా సిబ్బంది జాగ్రత్త పడతారు. అలాగే శరీరంలో ఏవైనా మెటల్ వస్తువులు, ఎలక్ట్రానిక్ పరికరాలు అమర్చారా అనే విషయాల గురించి వారిని అడిగి వివరాలు తెలుసుకుంటారు. మెటల్ వస్తువులు ఉంటే ఎమ్ఆర్ఐ స్కానింగ్ రేడియేషన్ కారణంగా ఇబ్బంది పడే అవకాశం ఉందని ముందుగానే ఇలాంటి జాగ్రత్తలు తీసుకుంటారు. అయితే ఏలూరు ఘటనలో డయాగ్నోస్టిక్ సిబ్బంది మెటల్ డిటెక్టర్ సాయంతో తనిఖీ చేయకపోవటంతో ఈ దారుణం చోటుచేసుకుంది. అలాగే సదరు మహిళ తన ఒంట్లో పేస్ మేకర్ అమర్చిన విషయం డయాగ్నోస్టిక్ సిబ్బందికి తెలిపారా లేదా అనేది స్పష్టంగా తెలియాల్సి ఉంది.

# ఏపీ-తెలంగాణ మధ్య గ్లాస్ బ్రిడ్జి..

# పైన వాహనాలు, కింద పడవలు..

# టూరిస్ట్ స్పాట్‌గా..!



తెలంగాణ-ఆంధ్రప్రదేశ్ మధ్య జాతీయ రహదారి నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ నేషనల్ హైవే నిర్మాణం పూర్తి అయితే నల్లమల రూపురేఖలు పూర్తిగా మారిపోనున్నాయి. ఈ క్రమంలోనే కొల్లపూర్ ప్రాంతం టూరిస్ట్ హబ్‌గా మారనుంది. ఈ మార్గంలో ఏపీ, తెలంగాణ సరిహద్దుల్లో కృష్ణా నదిపై ఐకానిక్ బ్రిడ్జి నిర్మించనున్నారు. ఇక ఈ బ్రిడ్జికి మరో స్పెషాలిటీ ఉంది. ఈ వంతెనను రెండు ఫ్లోర్లలో నిర్మించనుండగా.. పైనుంచి వాహనాల రాకపోకలు సాగనున్నాయి. ఇక దాని కింది అంతస్తులో గ్లాస్ బ్రిడ్జి నిర్మించనున్నారు. ఈ గ్లాస్ బ్రిడ్జిపై ప్రయాణిస్తూ.. కింద కృష్ణా నది అందాలను పర్యాటకులు ఆస్వాదించేలా రూపొందించనున్నారు. పైన వాహనాలు, కింద పడవలను చూస్తూ పర్యాటకులను మంత్రముగ్ధులను చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు.

తెలంగాణలోని నాగర్ కర్నూల్ జిల్లా కొల్లాపూర్... (printed: కొట్రా) నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని నంద్యాల వరకు 167-కే హైవే పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. అయితే ఈ గ్లాస్ బ్రిడ్జి అందుబాటులోకి వస్తే.. కొల్లాపూర్ పర్యాటక హబ్‌గా మారనుండగా.. ఇక ఈ బ్రిడ్జి నిర్మాణానికి నేషనల్ హైవే సంస్థ టెండర్లను పిలవడంతో నల్లమల ప్రాంతం మరింత అందాలను సంతరించుకోనుంది. మొత్తం రూ.1082.56 కోట్లతో నిర్మించే ఈ బ్రిడ్జిని.. తెలంగాణలోని సోమశిల(మల్లేశ్వరం) నుంచి ఏపీలోని సంగమేశ్వరం వరకు కృష్ణా నదిపై నిర్మించనున్నారు. అయితే దాదాపు1.77 కిలోమీటర్ల పొడవు ఉండే ఈ బ్రిడ్జిని కేవలం రెండు పిల్లర్లపైనే నిర్మించనుండటం మరో విశేషం.

ఈ డబుల్ స్టోర్డ్ బ్రిడ్జి పైనుంచి వాహనాలు వెళ్తాయి. ఇక కింది అంతస్తులో గ్లాస్ బ్రిడ్జిని నిర్మించనున్నారు. కృష్ణా నది అందాలు చూసేందుకు గ్లాస్ బ్రిడ్జిపై నుంచి నడిచివెళ్లేలా ఏర్పాట్లు చేస్తారు. ఇక ఆ గ్లాస్ బ్రిడ్జి నుంచి కింద కృష్ణా నదిలో ప్రవహించే పడవలు, బోట్లు, లాంచీలను చూసే అవకాశం ఉంటుంది. ఇక నదిలో పడవలు వెళ్లేందుకు రెండు పిల్లర్ల మధ్య 482 మీటర్ల దూరం ఉండేలా ఈ బ్రిడ్జిని నిర్మించనున్నారు.

ఇక నేషనల్ హైవే%-%167కే నిర్మాణంతో పాటు ఈ ఐకానిక్ బ్రిడ్జి పనులు పూర్తి అయితే కొల్లాపూర్ పర్యాటక హబ్‌గా మారనుందని అధికార వర్గాలు వెల్లడిస్తున్నాయి. ఈ ప్రాంతం మొత్తం నల్లమల అడవితో పాటు కృష్ణా నది బ్యాక్ వాటర్‌తో రెండు నదులు కలిసి ప్రవహిస్తున్నట్లుగా ఉంటుంది. కొల్లాపూర్ సంస్థానం, రాజవారి కోట, మాధవస్వామి ఆలయం, సోమశిల, అమరగిరి, మల్లేశ్వరం, మంచాలకట్ట, జటప్రోల్ ప్రాంతాలు ఆధ్యాత్మిక, ఎకో టూరిజం, వాటర్ స్పోర్ట్స్, సోమశిల నుంచి శ్రీశైలం లాంచీ ప్రయాణంతో ఆ ప్రాంతం మొత్తం పర్యాటకంగా ఎంతో అభివృద్ధి చెందుతుందని అంచనా వేస్తున్నారు.

మరోవైపు.. ఆ నల్లమల పర్యాటక ప్రదేశాలను తెలంగాణ టూరిజం, ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్?తో పాటు నేషనల్ హైవే సంస్థ కూడా ప్రచారం చేసుకుంటున్నాయి. ఇక సప్తనదుల సంగమ క్షేత్రంలో ఏడాదిలో 9 నెలల పాటు కృష్ణా నదిలో మునిగి ఉండే సంగమేశ్వర ఆలయం, అంకాలమ్మ కోట వంటివి కూడా అభివృద్ధి చెందుతాయని స్థానికులు ఆశగా ఎదురుచూస్తున్నారు.

# ఏపీలోని ఆ రైల్వేస్టేషన్‌కు మహర్దశ..

### కేంద్రం నిర్ణయంతో మారిపోనున్న రూపురేఖలు..




కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఏపీలోని రైల్వే ప్రాజెక్టులకు నిధులు కేటాయించిన సంగతి తెలిసిందే. 2025 కేంద్ర బడ్జెట్‌లో ఏపీలోని రైల్వే ప్రాజెక్టులకు రూ.9,417 కోట్లు కేంద్ర ప్రభుత్వం కేటాయించింది. ఈ విషయాన్ని రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. ఏపీలోని రైల్వే ప్రాజెక్టులకు కేంద్రం నుంచి పూర్తిగా సహకారం అందుతోందని.. ప్రాజెక్టుల పనులన్నీ వేగంగా జరుగుతున్నట్లు సోమవారం మీడియా సమావేశంలో వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం. రూ.80,097 కోట్ల విలువైన 43 ప్రాజెక్టుల పనులు జరుగుతున్నాయని వివరించారు. అలాగే ఏపీలోని 73 రైల్వే స్టేషన్లను రూ.2,051 కోట్లు ఖర్చుచేసి అభివృద్ధి చేస్తున్నట్లు రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. కేంద్ర మంత్రి చేసిన ఈ ప్రకటనతో ఏపీలోని రాజమండ్రి రైల్వే స్టేషన్ రూపురేఖలు మారిపోనున్నాయి.

అమృత్ భారత్ స్టేషన్ల పథకం కింద ఏపీలో 73 ప్రధాన రైల్వే స్టేషన్లను కేంద్రం అభివృద్ధి చేస్తోంది. ఈ క్రమంలోనే విశాఖపట్నం, నెల్లూరు, తిరుపతి, రాజమహేంద్రవరం రైల్వేస్టేషన్లను ఆధునీకరిస్తున్నారు. ఈ నాలుగు స్టేషన్ల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం రూ.1,132.43 కోట్లు ఖర్చుచేస్తోంది. ఇందులో రాజమహేంద్రవరం రైల్వేస్టేషన్ అభివృద్ధికి రూ.271.43 కోట్లు కేటాయించారు. తూర్పు గోదావరి జిల్లాకు సంబంధించి ఆరు రైల్వే స్టేషన్లను అమృత్‌భారత్ పథకం కింద అభివృద్ధి చేస్తున్నారు. రాజమండ్రితో పాటుగా అనపర్తి, నిడదవోలు, కాకినాడ టౌన్, తుని, సామర్లకోట రైల్వే స్టేషన్‌లలో ఇప్పటికే అభివృద్ధి పనులు చేపట్టారు. తాజా బడ్జెట్‌లోనూ వీటికి నిధులు కేటాయించగా.. రాజమండ్రి రైల్వే స్టేషన్‌కు రూ.271 కోట్లు కేటాయించారు.

అయితే త్వరలోనే గోదావరి పుష్కరాలు రానున్నాయి. పుష్కరాల నాటికి రాజమండ్రి రైల్వేస్టేషన్‌ను అభివృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ప్రధానంగా రాజమహేంద్రవరం రైల్వేస్టేషన్ తూర్పు వైపు విస్తరించనున్నారు. ఈ నిధులు వెచ్చించి జీ౦5 భవనం, అదనపు ప్లాట్‌ఫామ్‌లు నిర్మించనున్నారు. అలాగే ఎక్స్‌లేటర్లు, లిఫ్టులు, ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు నిర్మించనున్నారు. 300 కార్లు నిలిపేలా పార్కింగ్ సదుపాయం కల్పించనున్నారు. పాతభవనాలు తొలగించి, కొత్తవి నిర్మించడం సహా.. ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్లను అభివృద్ధి చేయనున్నారు. అలాగే మహిళలు, పురుషులు, దివ్యాంగులకు వేర్వేరుగా టాయిలెట్ల నిర్మాణం చేపట్టనున్నారు. మొత్తంగా రాజమండ్రి రైల్వేస్టేషన్ రూపురేఖలు మార్చేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

## కార్మికులు తరిమికొట్టే రోజులు ఆసన్న మవుతాయి ఖబర్దార్ రియాజ్ అరగంటి కృష్ణ జనగామ శ్రీనివాస్ గౌడ్ శ్రీను



రామగుండం, 04 ఫిబ్రవరి:ఐఎన్టియుసి నాయకులు జనగామ శ్రీనివాస్ గౌడ్, అరగంటి కృష్ణ, బేబి శ్రీను మాట్లాడుతూ రామగుండం 1 డివిజన్ ఓసిపి 5 లో గత రెండు రోజుల క్రితం జరిగిన సంఘటన నేపద్యంలో సమస్యలను ప్రశ్నించిన ఐ ఎన్ టి యు సి నాయకులు కార్మికులపై అధికారులకు తప్పుడు ఆధారాలు సృష్టించి కార్మికులకు నోటీసులు జారీ చేయడాన్ని ఎమ్మెల్యే దృష్టికి పై అధికారుల దృష్టికి తీసుకు వెళ్తే ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ సానుకూలంగా స్పందించి వెంటనే కార్మికుల సమస్యలు పరిష్కరించడానికి ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ ప్రత్యేక చొరవ తీసుకొని కార్మికుల పై ఉన్న ప్రేమ అభిమానాలను దృష్టిలో పెట్టుకొని సమస్య జటిలం కాకుండా వెంటనే అధికారులతో మాట్లాడి లెటర్లు రద్దు చేయించి పారిశ్రామిక అవగాహన తో ఉత్పత్తి సంస్థకు కార్మికులకు ఇబ్బంది లేకుండా పరిష్కరించాడని అందుకు ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ కు ఐఎన్టీయూసీ పక్షాన ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నామని మంగళవారం ఐ ఎన్ టి యు సి నాయకులు జనగామ శ్రీనివాస్ గౌడ్, అరగంటి కృష్ణ, బేబి శ్రీను పేర్కొన్నారు. అలాగే కార్మికుల సంక్షేమం సమస్యల పరిష్కారంతోపాటు సంస్థ ఉత్పత్తి అభివృద్ధి లక్ష్యంగా ముందుకు సాగుతున్న ఐ ఎన్ టి యు సి సెక్రెటరీ జనరల్ కనీస వేతనాల బోర్డ్ చైర్మన్ జన ప్రసాద్ ఆదేశాలతో వారి అడుగుజాడల్లో ఎన్ టి యు సి నాయకులు ఎలాంటి గ్రూపులు లేకుండా పనిచేస్తున్నారని కార్మికుల హక్కుల సమస్యల పరిష్కారంలో ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ సూచనలు జనక్ ప్రసాద్ అడుగుజాడల్లో పని చేస్తూనే ఉంటామని కార్మికులకు ఎలాంటి కష్టం వచ్చినా ముందుండి పనిచేస్తున్న ఐ ఎన్ టి సి సేవలను హెచ్ఎంఎస్ నాయకులు జీర్ణించుకోలేక సమస్య మేము పరిష్కరిస్తే గల్లి లీడర్ లాగా గనిపై ఫిట్ సెక్రటరీ లాగా వ్యవహరిస్తూ చంకలు గుద్దుకోవడం రియాజ్ కు సరికాదని ఇలాంటి చర్యలను కార్మికులు అసహ్యించుకుంటారని ఐఎన్టీయూసీ విషయంలో మరోసారి ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ విషయంలో తలాదూర్చి అవాకులు, చవాకులు పేలితే ఖబర్దార్ రియాజ్ అంటూ హెచ్చరించారు.

## మాజీ ముఖ్యమంత్రి, బిఆర్ ఎస్ అధినేత కేసిఆర్ కి కృతజ్ఞతలు తెలిపిన మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్ ..



హైదరాబాద్, 04 ఫిబ్రవరి :గిరిజన మహిళను గుర్తించి శాసనమండలి బిఆర్ఎస్ పార్టీ విప్ గా అత్యున్నత పదవిని అందించినందుకు తెలంగాణ రాష్ట్ర సాధకులు మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కి, పార్టీ కోసం అహర్నిశలు కృషి చేస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు కి మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేసారు. అనంతరం మాట్లాడుతూ నాపై ఉంచిన బాధ్యతను మరింత సమర్ధవంతంగా నిర్వహిస్తానని, ప్రజా వ్యతిరేక పాలనపై పోరాటం చేస్తూనే ఉంటానని అన్నారు.

# గిరిజన ప్రజలకు సిఆర్పిఎఫ్ ఎల్లప్పుడూ అండగా ఉంటుంది

### సిఆర్పిఎఫ్ 39 బెటాలియన్ కమాండెంట్ ప్రశాంత్ కుమార్ శ్రీ వాస్తవ

### 39 బెటాలియన్ సిఆర్పిఎఫ్ ఆధ్వర్యంలో స్కిల్ డెవలప్మెంట్ ప్రోగ్రాం



ములుగు 04 ఫిబ్రవరి ):గిరిజన ప్రజలకు సీఆర్పీఎఫ్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని 39 బెటాలియన్ సిఆర్పిఎఫ్ కమాండెంట్ ప్రశాంత్ కుమార్ శ్రీ వస్తావా అన్నారు . మంగళవారం ములుగు జిల్లా ఎటునాగారం డివిజన్ పరిధిలో ఏజెన్సీ గిరిజన ప్రజలకు సిఆర్పిఎఫ్ 39 బెటాలియన్ ఆధ్వర్యంలో నెలరోజుల స్కిల్ డెవలప్మెంట్ ప్రోగ్రాం ఇవ్వడం జరిగిందని, ఈ కార్యక్రమంలో శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్స్ కూడా అందించడం జరిగిందని ఆయన అన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గిరిజన ప్రజలకు స్వతహాగా జీవితం



గడుపుటకు విభిన్న పరిశ్రమలలో శిక్షణ ఇవ్వడం జరిగిందని, దీనివల్ల వారు ఎవరిపైన ఆధారపడకుండా సొంతంగా పనులు చేసుకొని వారి కుటుంబ సభ్యులతో సంతోషంగా గడపచ్చని అన్నారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎస్పీ ఎటునాగారం శివం ఉపాధ్యాయ మాట్లాడుతూ గిరిజన ప్రజలు ఇలాంటి అవకాశాలను ఉపయోగించుకొని ఎవరి మీద ఆధారపడకుండా సొంతంగా పనులు చేసుకునే విధంగా ఇలాంటి కార్యక్రమాలు ఉపయోగపడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో పంచంలాల్ ద్వితీయ కమాండెంట్, రజిత డిప్యూటీ కమాండెంట్, సిహెచ్ నారాయణ, ప్రశాంత్ వెలుగు అసిస్టెంట్ కమాండెంట్, సీఐ ఎటునాగారం శ్రీనివాస్ ఎస్ఐ హేతునాగారం తాజుద్దీన్ సిఆర్పిఎఫ్ సిబ్బంది సివిల్ సిబ్బంది పాల్గొన్నారు.

## భూ సమస్యలతో పాటు ఇతర సమస్యల పై అవగాహనా కలిల్పించుకొని ప్రజలకు అందుబాటులో ఉంటూ బాద్యత గా విధులు నిర్వహించాలి, జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్.




వికారాబాద్ , 04 ఫిబ్రవరి : మంగళవారం వీడియో కాన్ఫరెన్సు హాలు నందు జిల్లా లో నూతనంగా విదుల లో చేరిన 34 మంది జూనియర్ అసిస్టెంట్ లకు అవగాహనా కార్యక్రమము ఏర్పాటు చేసారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జూనియర్ అసిస్టెంట్ల ను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రజా స్వామ్యం లో రెవెన్యూ లో పని చేయటమంటే చాల బాధ్యతతో పని చేయాల్సిన అవసరముందని, రెవెన్యూ ఒక్కటే కాదు, ఇతర శాఖ లపై అవగాహనా కలిగి ఉండాలని, తెలంగాణా చట్టాలపై పూర్తి అవగాహనా కలిగి ఉండాలని అన్నారు. భూ సమస్యలు ఉంటేనే ప్రజలు వస్తారని, వారు ఎందుకు వచ్చారు, ఏమి సమస్య ఉంది, అన్ని వివరాలు పూర్తి స్తా యి లో తెలుసుకొని ముందుకు వెళ్ళాల్సి ఉంటుందని అన్నారు. సి సి ఎల్ ఎ రూల్స్ ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించిన వివిధ అంశాలలో అవగాహనా కలిగి ఉండాలని, ప్రజల సమస్యలను సానుకులతతో పూర్తి చేయాల్సి ఉంటుందన్నారు. అనంతరం అదనపు కలెక్టర్ (రిటైరేడ్ ) సురేష్ పొద్దార్ రెవెన్యూ రికార్డ్స్, ఫైల్ సిస్టం, ఇనాం, ప్రభుత్వ భూమి, క్లెయిమ్స్ మరియు అభ్యంతరాలు




,భూ రికార్డులు , తెలంగాణా వివిధ చట్టాల అమలు తీరుపై అవగాహనా కలిపించారు. ఈ కార్యక్రమమలో జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్, ఎ ఓ ఫర్హీన , జూనియర్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

# ఈవీఎం గోడౌన్‌ను సందర్శించిన జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్



వికారాబాద్ , 04 ఫిబ్రవరి :జిల్లా కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయం లో గల ఈవీఎం గోడౌన్ ను కలెక్టర్ ప్రతీక్ జైన్ మంగళవారము సందర్శించారు. సాధారణ పరిశీలన ప్రక్రియలో భాగంగా క్షేత్రస్థాయి సందర్శన జరిపారు. ఈవీఎం గోడౌన్ కు వేసిన సీళ్లను పరిశీలించి, సీ.సీ టీ.వీలో



బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వివి.ప్యాట్లు, ఇతర ఎన్నికల సామాగ్రిని భద్రపరిచిన తీరును తనిఖీ చేశారు. ఈవీఎం గోడౌన్ వద్ద పోలీసు బందోబస్తు తీరును పరిశీలించారు. రిజిస్టర్ల ను పరిశీలించి సంతకాలు చేశారు.. కలెక్టర్ గారితో పాటు జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ లింగ్యా నాయక్, తహసిల్దార్ లక్ష్మినారాయణ ,ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు నేమత్ హాలి,, సంబంధిత అధికారులు తదితరులు ఉన్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రులలోనే ప్రసవాలు అయ్యేటట్లు పనిచేయాలి

### వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ గోపాలరావు



ములుగు ,, 04 ఫిబ్రవరి:జాతీయ ఆరోగ్య కార్యక్రమాలను విస్తృత ప్రచారం గావించి ప్రజలలో ఆరోగ్య కార్యక్రమాలపై అవగాహన కల్పించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ గోపాలరావు "ఆశా డే "సందర్భంగా రాయినిగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో పనిచేస్తున్న ఆశ కార్యకర్తలను , ఆరోగ్య కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం సమావేశ మందిరంలో ఏర్పాటుచేసిన ఆషాడే ను సందర్శించి ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడుతూ ఆశా కార్యకర్తలు ఇంటింటి సందర్శనగపించినప్పుడు ఆరోగ్య కార్యక్రమాలపై ప్రజలలో ఉన్న ఆందోళన అనుమానాలు అనుమానాలను నివృత్తి చేస్తూ ప్రజలు ప్రభుత్వ వైద్య సేవలను ఉపయోగించుకునేటట్లు చేయాలని ఆశా కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. జాతీయ మాతా శిశు సంరక్షణ , పోషకాహార కార్యక్రమంలో గర్భిణీ స్త్రీల నమోదు 12 వారాల లోపు చేయించి, గర్భిణీ స్త్రీలకు నాలుగు(4) వైద్య పరీక్షలను చేయించి ప్రభుత్వ ఆసుపత్రులలో నే ప్రసవాలు అయ్యేటట్లు పనిచేయాలని ఆశా కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అసంక్రమిక వ్యాధుల నియంత్రణాధికారి డాక్టర్. పవన్ కుమార్, రాయిని గూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్. ప్రసాద్, డాక్టర్. నాగ అన్వేష్, డెమో సంపత్ ,కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ పూర్ణ సంపత్ రావు , ఎం సి హెచ్ ప్రోగ్రాం మానిటరింగ్ సూపర్వైజర్ సురేష్ బాబు, అసంక్రమిక వ్యాధుల కోఆర్డినేటర్ భూపాల్ రెడ్డి ,ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాల మిడ్ లెవెల్ హెల్త్ ప్రోవైడర్స్, సూపర్వైజర్స్ దేవేందర్, నిర్మల మేరీ ,దేవమ్మ ,ఆరోగ్య కార్యకర్తలు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# వీటిని తింటూ కిడ్నీలను ఆరోగ్యంగా ఉంచుకోండి



హెల్త్ న్యూస్ ,04 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ):మన శరీరంలో అత్యంత ముఖ్యమైన అవయవం కిడ్నీలు. ఇవి శరీరమంతా ప్రవహించే రక్తాన్ని శుద్ధి చేస్తాయి. ఎప్పటికప్పుడు రక్తంలో చేరే మలినాలను, టాక్సిన్స్‌ను వడపోసి మూత్రం రూపంలో బయటకు పంపుతాయి. ఇతర అవయవాలకు హాని కలిగించే.. టాక్సిన్స్‌ను నిరోధిస్తాయి. ద్రవ సమతుల్యతను నియంత్రిస్తాయి, రక్తపోటును నియంత్రించడానికి సహాయపడే హార్మోన్‌లను ఉత్పత్తి చేస్తాయి. ఎర్ర రక్త కణాల ఉత్పత్తిని కిడ్నీలు ప్రేరేపిస్తాయి. ఇవి సోడియం, పొటాషియం, ఫాస్పరస్ వంటి శరీరంలోని ఎలక్ట్రోలైట్‌ల సమతుల్యతను నియంత్రిస్తాయి. ఈ ఎలక్ట్రోలైట్స్‌లో అసమతుల్యత వివిధ ఆరోగ్య సమస్యలకు దారి తీస్తుంది. కిడ్నీల పనితీరు బలహీనపడితే.. రక్తపోటు పెరుగుతుంది. ఇది హృదయ సంబంధ సమస్యలకు దారితీస్తుంది. కిడ్నీలు ఎర్ర రక్త కణాల ఉత్పత్తిని ప్రేరేపించే ఎరిథ్రోపోయిటిన్ అనే హార్మోన్‌ను కూడా ఉత్పత్తి చేస్తాయి. కిడ్నీలు పనితీరు మందగిస్తే.. రక్తహీనత, ఆక్సిజన్ - వాహక సామర్థ్యం తగ్గుతుంది. ఈ నేపథ్యంలో కిడ్నీలో ఆరోగ్యాన్ని రక్షించుకోవడం చాలా ముఖ్యం. లైఫ్‌స్టైల్‌లో మార్పులు, సరిపడా నీరు తాగడం, వ్యాయామం, పోషకాహారం తీసుకుంటే.. కీడ్నీల ఆరోగ్యాన్ని రక్షించుకోవచ్చు. మీ డైట్‌లో కొన్ని ఆహార పదార్థాలు చేర్చుకుంటే.. కిడ్నీ ఆరోగ్యాన్ని సంరక్షించుకోవచ్చని నిపుణులు చెబుతున్నారు.

## బాదం

ఆరోగ్యకరమైన కొవ్వులు, యాంటీ ఆక్సిడెంట్లతో నిండిన బాదంలో అధిక స్థాయిలో మెగ్నీషియం ఉంటుంది. ఇది కిడ్నీ ఆరోగ్ని రక్షించుకోవడంలో కీలకమైన కారకం అయిన రక్తపోటును నియంత్రించడంలో తోడ్పడుతుంది.అయితే, బాదంపప్పులో కేలరీలు ఎక్కువగా ఉంటాయి కాబట్టి వాటిని మితంగా తినాలని గుర్తుంచుకోండి.?

## క్వినోవా

క్వినోవాలో ప్రొటీన్, ఫైబర్, అవసరమైన అమైనో యాసిడ్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి కిడ్నీల ఆరోగ్యానికి అద్భుతమైన ఎంపిక అని చెప్పొచ్చు. క్వినోవాను అన్నం, రోటీలకు ప్రత్యామ్నాయంగా తీసుకోవచ్చు

## కాలే

కాలో క్రూసిఫెరస్ కుటుంబానికి చెందిన కూరగాయ. కాలేలో విటమిన్ ఏ, సి , ఐరన్, కాల్షియ వంటి పోషకాలు సమృద్ధిగా ఉంటాయి. ఈ పోషకాలు కిడ్నీల పనితీరుకు మద్దతు ఇస్తుంది. కాలే కిడ్నీలకు సూపర్ ఫుడ్ అని చెప్పొచ్చు. కాలేను సలాడ్లు, వంటలలో చేర్చవచ్చు.

## పాలకూర..

పాలకూరలో ఐరన్, కాల్షియం, విటమిన్ బి9 వంటి పోషకాలు సమృద్ధిగా ఉంటాయి. ఈ పోషకాలు కిడ్నీ ఆరోగ్యానికి మద్దతు ఇస్తాయి, మూత్రపిండాల్లో రాళ్ల ప్రమాదాన్ని తగ్గిస్తాయి. మీరు పాలకూరను కూరలు, పప్పు, స్మూతీలలోనూ యాడ్ చేసుకోవచ్చు.

## బ్లూబెర్రీస్..

ఈ చిన్న బెర్రీలు యాంటీఆక్సిడెంట్లతో నిండి ఉంటాయి. వీటిలో యాంటీఇన్ఫ్లమేటరీ గుణాలు మెండుగా ఉంటాయి. యాంటీఇన్ఫ్లమేటరీ గుణాలు.. ఆక్సీకరణ ఒత్తిడి కారణంగా కిడ్నీలకు జరిగే నష్టాన్ని తగ్గిస్తాయి.

## చియా విత్తనాలు..

చియా సీడ్స్‌లో ఫైబర్, ఆరోగ్యకరమైన ఒమేగా -3 ఫ్యాటీ యాసిడ్స్, మొక్కల ఆధారిత ప్రోటీన్ అద్భుతమైన మూలం. ఇవి ఆరోగ్యకరమైన జీర్ణక్రియను మెరుగుపరుస్తాయి, రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడానికి ప్రోత్సహిస్తాయి. ఇది సరైన మూత్రపిండాల పనితీరుకు మద్దతు ఇస్తాయి. మీరు సలాడ్లు, పుడ్డింగ్స్, స్మూతీస్‌లో చియా గింజలను యాడ్ చేసుకోవచ్చు.

## పప్పు..

పప్పులో డైటరీ ఫైబర్, ప్రొటీన్, ఐరన్ పుష్కలంగా ఉంటాయి. ఇవి కిడ్నీ ఆరోగ్యానికి మేలు చేస్తాయి. ఇవి రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రిస్తాయి, ఆరోగ్యకరమైన జీర్ణక్రియను ప్రోత్సహిస్తాయి. మీ డైట్‌లో తరచుగా పప్పు తీసుకుంటే.. కిడ్నీలు ఆరోగ్యంగా ఉంటాయి.

## చిలగడదుంపలు

చిలగడదుంపల్లో ఫైబర్, విటమిన్ ఏ, సి అధికంగా ఉంటాయి. చిలగడదుంపల్లో సాధారణ బంగాళదుంపలతో పోలిస్తే.. పొటాషియం కంటెంట్ తక్కువగా ఉంటుంది, ఇది మూత్రపిండాల ఆరోగ్యానికి మేలు చేస్తుంది.

## బ్రకోలీ..

బ్రకోలీలో యాంటీఆక్సిడెంట్లు, పోషకాలు, ఫైబర్ మెండుగా ఉంటాయి. ఇవి జీర్ణక్రియకు మేలు చేస్తాయి. దీనిలో యాంటీ ఇన్ఫ్లమేటరీ గుణాలు మెండుగా ఉంటాయి. ఇది శరీరంలోని వాపును తగ్గిస్తాయి. తద్వారా మూత్రపిండాల ఆరోగ్యానికి మద్దతు ఇస్తుంది.

# రాత్రి ఆలస్యంగా నిద్రపోతే డేంజరే

హెల్త్ న్యూస్ ,04 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ):ఉరుకులు పరుగుల జీవితంలో ఎన్నో అనారోగ్య సమస్యలు వెంటాడుతున్నాయి.. ముఖ్యంగా పేలవమైన జీవనశైలి, అనారోగ్యకరమైన ఆహారం ఇవన్నీ పలు సమస్యల బారిన పడేలా చేస్తుంది.. అయితే, ఈ రోజుల్లో ప్రజల జీవనశైలి రాత్రి ఆలస్యంగా నిద్రపోయేలా మారింది. ఇది సాధారణంగా పని చేసే యువతలో కనిపిస్తుంది. చాలా మంది పనిచేయడం వల్ల రాత్రిపూట ఆలస్యంగా నిద్రపోతారు. చాలా సార్లు ప్రజలు దీనిని ఒక సాధారణ విషయంగా తీసుకుంటారు. కానీ, రాత్రిపూట ఎక్కువసేపు ఆలస్యంగా నిద్రపోవడం వల్ల అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయి..



రాత్రి వేళ ఆలస్యంగా నిద్రపోవడం వల్ల ఒక వ్యక్తి ఎలాంటి మానసిక, శారీరక సమస్యలను ఎదుర్కొంటారు%౸% ఎలాంటి అనారోగ్య సమస్యలు వస్తాయి..? వైద్య నిపుణులు ఏం చెబుతున్నారు.. ఈ వివరాలను తెలుసుకోండి..

ఆరోగ్య నిపుణుల ప్రకారం.. రాత్రి ఆలస్యంగా నిద్రపోవడం వల్ల అధిక రక్తపోటు, గుండె సమస్యలు వచ్చే ప్రమాదం పెరుగుతుంది. దీనితో పాటు, రోగనిరోధక శక్తి సమస్య కూడా పెరుగుతుంది. దీని కారణంగా, మీరు అనేక రకాల ఇన్ఫెక్షన్లను కూడా పొందే అవకాశం ఉంది. దీనితో పాటు, రాత్రి ఆలస్యంగా నిద్రపోవడం వల్ల హార్మోన్ల అసమతుల్యత కూడా ఏర్పడుతుంది.. మధుమేహం, జీర్ణ సంబంధిత సమస్యలు వస్తాయి.

నిద్ర లేకపోవడం వల్ల మానసిక ఆరోగ్యం కూడా ప్రభావితం అవుతుంది. ఇది మీ జ్ఞాపకశక్తిని, ఏకాగ్రతను తగ్గిస్తుందని వైద్య నిపుణులు చెబుతున్నారు. రాత్రిపూట ఆలస్యంగా నిద్రపోవడం వల్ల కూడా డిప్రెషన్, ఆందోళన వంటి సమస్యలు వస్తాయని చెబుతున్నారు. దీనితో పాటు, చిరాకు, కోపం కూడా పెరుగుతుంది. అదే సమయంలో, కళ్ళ కింద నల్లటి వలయాలు, మొహంపై ముడతలు కూడా కనిపిస్తాయి.

ఒక వ్యక్తి ఒక రోజులో ఎంత సేపు నిద్రపోవాలి?

ఒక వ్యక్తికి ఒక రోజులో ఎంత నిద్ర అవసరం అనే ప్రశ్నకు.. అది వ్యక్తి వయస్సుపై ఆధారపడి ఉంటుందని వైద్య నిపుణులు చెబుతున్నారు. మనం అప్పుడే పుట్టిన శిశువు గురించి మాట్లాడుకుంటే.. వారు 14 నుంచి 16 గంటలు నిద్రపోవాలి..

అదే సమయంలో, పాఠశాలకు వెళ్లే పిల్లలు 9 నుంచి 13 గంటలు నిద్రపోవాలి.

యుక్తవయస్సులోకి అడుగుపెట్టినప్పుడు 9 నుంచి 10 గంటలు నిద్రపోవాలి.

యువత, మధ్య వయస్కులు రోజుకు 7 నుంచి 9 గంటలు నిద్రపోవాలి.

అదేవిధంగా, వృద్ధులు కూడా 7 నుంచి 9 గంటలు నిద్రపోవాలి.

ఎప్పుడు నిద్రపోవాలి..

ఏ వ్యక్తి అయినా రాత్రి 10 గంటలకే నిద్రపోవాలి.. ఎందుకంటే మన నిద్ర చక్రం సూర్యోదయం - సూర్యాస్తమయంపై ఆధారపడి ఉంటుంది. సూర్యుడు అస్తమించగానే.. మన శరీరంలో మెలిటాన్యులర్ హార్మోన్ విడుదల కావడం ప్రారంభమవుతుంది.. ఇది మనకు నిద్ర పట్టడానికి సహాయపడుతుంది.. ఉదయం వచ్చే సమయానికి దాని ప్రభావం ముగుస్తుంది. మన శరీరంలో రాత్రి నాలుగు గంటలకు గరిష్టంగా మెలటోనియం విడుదల అవుతుంది. ఈ సమయంలో మనం బాగా నిద్రపోతాము.. కాబట్టి ఇది మనం నిద్రించడానికి అనువైన సమయం.. వయస్సుకి నిద్రతో సంబంధం లేదని.. కానీ వయస్సు పెరిగే కొద్దీ నిద్రపోవడంలో సమస్య వస్తుందని వైద్య నిపుణులు చెబుతున్నారు.

# రక్త ప్రసరణ వేగాన్ని పెంచే హెల్తీ వెజిటేబుల్..



హెల్త్ న్యూస్ ,04 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ): బీట్ రూట్ అనేక ఆరోగ్య ప్రయోజనాలను కలిగినటువంటి హెల్తీ వెజిటేబుల్. మనకు సహజంగా లభించే పండ్లూ కాయగూరలూ తినడం ఆరోగ్యానికి మంచిదని పోషకాహార నిపుణులు అంటున్నారు. శక్తినిచ్చే శాఖాహారదుంపల్లో బీట్‌రూట్‌ది మొదటి స్థానం. బీట్ రూట్‌లో నైట్రేట్‌ల నిల్వలు అధికంగా ఉంటాయి. ఇవి నైట్రేట్ ఆక్సైడ్‌లుగా మారి రక్తప్రసరణ వేగాన్ని పెంచుతాయి. రక్తనాళాల్లో రక్తం గడ్డకట్టడాన్నిఅరికడుతుంది.

అంతేకాదు బీట్ రూట్‌లోని పుష్కలమైన ఐరన్, వ్యాధి నిరోధకతకు పెంచుతుంది, కేన్సర్‌కు వ్యతిరేకంగా పోరాడుతుంది. రోజుకి ఓ గ్లాసుడు బీట్‌రూట్ రసం తాగితే రక్తపోటు తగ్గటానికి దోహదపడుతుంది. నాడుల ఆరోగ్యం, జ్ఞాపకశక్తి, కాలేయం పనితీరు మెరుగుపడటానికీ బీట్‌రూట్ తోడ్పడుతుంది.

గర్భిణుల్లో ఆరోగ్యకరమైన కణజాలం వృద్ధి చెందేలా చేస్తుంది. ఆరోగ్యంగా గడపడానికి శక్తిచాలా అవసరం. అటువంటి శక్తిని అందించడంలో బీట్ రూట్ బాగా పనిచేస్తుంది. బద్ధకంగా అనిపిస్తుంటే బీట్ రూట్‌ని చిన్న చిన్న స్లైస్‌గా కట్ చేసి తింటే దాంతో తక్షణ శక్తిని పొందగలుగుతాం.

# పాకిస్తాన్ స్క్వాడ్‌లో ఆ ఆరుగురిపై విమర్శలు..

స్పోర్ట్స్ న్యూస్ ,04 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ):2025 ఛాంపియన్స్ ట్రోఫీ కోసం పాకిస్తాన్ తన జట్టును ప్రకటించింది. కానీ, ఈ జట్టు తన సొంత ఆతిథ్యంలో ఐసీసీ టోర్నమెంట్‌ను గెలవగలదా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. అందుకు కారణం కూడా తాజాగా బయటకు వచ్చింది. ఛాంపియన్స్ ట్రోఫీ కోసం ఎంపిక చేసిన జట్టును PCB సొంత వ్యక్తులు కూడా విశ్వసించడం సాధ్యం కానందున ఈ ప్రశ్న తలెత్తుతుంది. వీరందరి ఆత్మవిశ్వాసం లేకపోవడానికి కారణం జట్టు ఎంపికలో లోపాలు. ఛాంపియన్స్ ట్రోఫీ జట్టుపై ప్రశ్నలు లేవనెత్తిన పాకిస్తాన్ లెజెండ్ అబ్దుర్ రవూఫ్ ఖాన్.. పాకిస్తాన్ టీవీ ఛానెల్‌లో జట్టుకు సంబంధించిన షోలో పాక్ జట్టును తీవ్రంగా విమర్శించాడు.



పాక్ జట్టు బాబర్ ఆజంపై ఆధారపడి ఉందా?

టీవీ ఛానెల్‌లో ప్రసారమైన కార్యక్రమంలో, పాకిస్తాన్ జట్టు బాబర్ ఆజంపై ఆధారపడి ఉందని చెప్పుకొచ్చాడు. ఛాంపియన్స్ ట్రోఫీలో బాబర్ ఆజం బ్యాట్ పనిచేస్తేనే ఏదైనా జరుగుతుందని తెలిపాడు. అనుభవజ్ఞులు కూడా ఈ షోలో సౌద్ షకీల్‌పై కొంత నమ్మకాన్ని చూపించడం గమనార్హం.

# కోహ్లీ ఫ్యాన్స్‌కు అదిరిపోయే న్యూస్..
# ఆర్సీబీ కెప్టెన్‌పై ఫ్రాంచైజీ కీలక ప్రకటన



స్పోర్ట్స్ న్యూస్ ,04 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ): విరాట్ కోహ్లీ మరోసారి రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు సారథ్యం వహించగలడా? ఫాఫ్ డు ప్లెసిస్ విడుదలైన తర్వాత నుంచి ఇటువంటి ఊహాగానాలు కొనసాగుతున్నాయి. ఇప్పుడు ఆర్సీబి కెప్టెన్ ప్రశ్నపై జట్టు నుంచి ఓ కీలక ప్రకటన వచ్చింది. అదేంటో ఓసారి చూద్దాం.. ఇంగ్లాండ్ తో వన్డే సిరీస్ తర్వాత టీం ఇండియా ఆటగాళ్లు ఛాంపియన్స్ ట్రోఫీలో కనిపించనున్నారు. ఆ తరువాత, భారత ఆటగాళ్ళు ఐపీఎల్ 2025 లో కనిపిస్తారు. ఈ టీ-20 లీగ్ కొత్త సీజన్ మార్చి 21 నుంచి ప్రారంభమవుతుంది. అయితే, ఈ సీజన్ గురించి అతిపెద్ద ప్రశ్న ఏమిటంటే రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు కి ఎవరు కెప్టెన్ అవుతారు? ఆర్సీబీ కెప్టెన్ పేరు ఇంకా ఖరారు కాలేదు. విరాట్ కోహ్లీ మరోసారి ఆర్సీబీ సారథ్యం వహించవచ్చని చాలాసార్లు వార్తలు వచ్చాయి. మరోసారి అలాంటి వార్తలు ఊపందుకుంటున్నాయి. ఈ విషయంపై ఆర్సీబీ బృందం నుంచి కీలక ప్రకటన కూడా వచ్చింది.

కోహ్లీ మళ్ళీ ఆర్‌సిబి కెప్టెన్ అవుతాడా? అధికారికంగా ఇంకా ఏమీ చెప్పనప్పటికీ, కోహ్లీ మరోసారి ఆర్సీబీకి నాయకత్వం వహించగలడని అభిమానులు నమ్ముతున్నారు. ఫాఫ్ డు ప్లెసిస్ విడుదలైన తర్వాత, ఆర్సీబీ తదుపరి కెప్టెన్ పేరు ఇంకా ప్రకటించలేదు. ఇంతలో, ఆర్‌సీబీ కెప్టెన్ ప్రశ్నపై ఆర్‌సీబీ సీఓఓ రాజేష్ మీనన్, 'ప్రస్తుతానికి మేం ఏం నిర్ణయించుకోలేదు' అంటూ చెప్పుకొచ్చాడు. అన్నారు. మా బృందంలో చాలా మంది నాయకులు ఉన్నారు. అలాంటి ఆటగాళ్ళు 4-5గురు ఉన్నారు. ఏమి చేయాలో ఇంకా చర్చ జరగలేదు. మేమంతా ఆలోచించి ఒక నిర్ణయానికి వస్తాం' అంటూ తెలిపాడు.

**143 మ్యాచ్‌ల్లో ఆర్‌సిబికి నాయకత్వం:** ఐపీఎల్ ప్రారంభమైనప్పటి నుంచి విరాట్ కోహ్లీ ఆర్‌సీబీతో అనుబంధం కలిగి ఉన్నాడు. అతను చాలా సంవత్సరాలు ఈ జట్టుకు నాయకత్వం వహించాడు. 2011లో, అతను మొదటిసారి జట్టుకు నాయకత్వం వహించాడు. అయితే, అతను 2013 సంవత్సరంలో పూర్తి సమయం కెప్టెన్ అయ్యాడు. అతను 2021 వరకు నిరంతరం ఆర్సీబీ కెప్టెన్‌గా కొనసాగాడు. ఆ తరువాత అతను కెప్టెన్సీని విడిచిపెట్టాడు. తరువాత ఫాఫ్ డు ప్లెసిస్ జట్టును నడిపించాడు. ప్లెసిస్ లేకపోయినా, విరాట్ కొన్ని మ్యాచ్‌లకు కెప్టెన్‌గా వ్యవహరించాడు. ఇప్పటివరకు కోహ్లీ 143 మ్యాచ్‌లకు రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుకు నాయకత్వం వహించాడు.

**ఆర్‌సీబీకి ట్రోఫీ గెలిపించని కోహ్లీ:** విరాట్ కోహ్లీ 143 మ్యాచ్‌ల్లో 70 ఓడిపోయి 66 మ్యాచ్‌ల్లో గెలిచాడు. అయితే, కోహ్లీ తన కెప్టెన్సీలో ఒక్కసారి కూడా ఆర్‌సీబీని ఛాంపియన్‌గా చేయలేకపోయాడు. కానీ, అతని కెప్టెన్సీలో, ఆర్సీబీ 2016 లో ఫైనల్‌కు చేరుకుంది. కానీ, సన్‌రైజర్స్ హైదరాబాద్ చేతిలో ఓడిపోయింది.

# భారత వన్డే జట్టులో చేరిన టీ20 మిస్టీ మ్యాన్..

స్పోర్ట్స్ న్యూస్ ,04 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ):ఫిబ్రవరి 6 నుంచి ఇంగ్లాండ్‌తో మూడు వన్డేలు ఆడేందుకు భారత జట్టు సిద్ధమైంది. అయితే, ఈ మ్యాచ్‌లకు ముందు నాగ్‌పూర్‌లో జరిగే షార్ట్ క్యాంప్‌లో వరుణ్ చక్రవర్తి భారత వన్డే జట్టులో చేరాడు. సిరీస్ ప్రారంభానికి ముందు రోహిత్ శర్మ సేన షార్ట్ క్యాంప్ కోసం ఇక్కడికి వచ్చిన సంగతి తెలిసిందే. ఇప్పటికే ఇంగ్లండ్ జట్టుపై టీ20ఐలలో అద్భుత ప్రదర్శన చేసిన వరుణ్ చక్రవర్తి.. టీ20 సిరీస్ గెలవడంలో కీలక పాత్ర పోషించాడు. ఇంగ్లాండ్‌తో జరిగిన ఐదు టీ20ఐలలో ఈ స్పిన్ మాంత్రికుడు 14 వికెట్లు పడగొట్టాడు. అన్ని మ్యాచ్‌లలో ప్రత్యర్థిపై ఆధిపత్యం చెలాయించాడు. రాజ్‌కోట్‌లో ఇంగ్లాండ్‌తో జరిగిన మూడవ టీ20ఐలో ఐదు వికెట్లు పడగొట్టాడు. నాగ్‌పూర్‌లో జరిగే శిబిరంలో అతను చేరడంపై అధికారిక సమాచారం లేదు. ఇది కేవలం నెట్స్ కోసమేనా లేదా అతను వన్డేల్లో పాల్గొంటాడా అనేది ఇంకా తెలియాల్సి ఉంది.33 ఏళ్ల అతను ఇంకా వన్డేల్లో అరంగేట్రం చేయలేదు. కానీ, దేశీయంగా తన రాష్ట్రం తమిళనాడు తరపున 23 లిస్ట్ ఏ మ్యాచ్‌లు ఆడాడు. ఈ సంవత్సరం ప్రారంభంలో విజయ్ హజారే ట్రోఫీ సమయంలో అతను చివరిసారిగా ఆడాడు. వడోదరలో జరిగిన ప్రాథమిక క్వార్టర్ ఫైనల్ ఘర్షణలో రాజస్థాన్‌పై ఐదు వికెట్లు సాధించాడు.



# నిమిషాల్లోనే అమ్ముడుబోయినా టికెట్లు

ఇండియా-పాకిస్తాన్ మధ్య జరిగే క్రికెట్ మ్యాచ్‌లు ఎప్పుడూ అభిమానులను ఉద్రూతలూగిస్తాయి. 2025 ఐసిసి ఛాంపియన్స్ ట్రోఫీలో భారత్ VS పాకిస్తాన్ గ్రూప్-స్టేజ్ మ్యాచ్‌కు డిమాండ్ అమాంతం పెరిగింది. ఫిబ్రవరి 23న దుబాయ్ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియం వేదికగా ఈ హై-వోల్టేజ్ పోరు జరగనుండగా, టిక్కెట్లు అమ్మకానికి వచ్చిన కొన్ని నిమిషాల్లోనే సోల్డ్ అవుట్ అయ్యాయి. టిక్కెట్ల కోసం 1,50,000 మందికి పైగా అభిమానులు ఆన్‌లైన్‌లో క్యూలో నిలబడి, గంటకు పైగా వేచిచూసినప్పటికీ, చాలా మంది నిరాశచెందారు. కొన్ని విభాగాల్లో టిక్కెట్ల ధరలు లక్ష రూపాయలకు పైగా ఉండటంతో, క్రికెట్ పట్ల అభిమానుల ఆత్రుత మరోసారి రుజువైంది.



### టిక్కెట్ల రద్దీతో అభిమానుల ఆశ్చర్యం

టిక్కెట్ల కోసం పోటీ తీవ్రంగా ఉండటంతో, దుబాయ్ నివాసితులు, క్రికెట్ ఔత్సాహికులు ఆశ్చర్యపోయారు. "నేను చాలా పొడవైన క్యూను ఊహించాను, కానీ టిక్కెట్లు ఇంత వేగంగా అమ్ముడుపోవడం అసలు ఊహించలేదు. నేను నా టికెట్ బుక్ చేసుకునే సమయానికి, కేవలం ఖరీదైన విభాగాలే మిగిలి ఉన్నాయి" అని దుబాయ్‌కు చెందిన క్రికెట్ అభిమాని సుధాశ్రీ అన్నారు. దిర్హామ్ 2,000 (సుమారు రూ.47,434) ధర గల ప్లాటినం విభాగం, దిర్హామ్ 5,000 (రూ1.8 లక్షలు) విలువైన గ్రాండ్ లాంజ్ విభాగం టిక్కెట్లు కూడా వేగంగా అమ్ముడయ్యాయి. దుబాయ్ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియం కేవలం 25,000 మంది ప్రేక్షకులకు మాత్రమే వసతిని కల్పించగలదని దృష్టిలో ఉంచుకుంటే, ఇండియా VS పాకిస్తాన్ మ్యాచ్ క్రేజ్ ఏ స్థాయిలో ఉందో అర్థమవుతోంది.

చారిత్రాత్మకంగా, భారతదేశం VS పాకిస్తాన్ మ్యాచ్ కేవలం క్రికెట్ మైదానంలోనే కాకుండా, ఆర్థికంగా కూడా ప్రభావం చూపుతుంది. ఇండియా-పాక్ మ్యాచ్‌లు జరగబోయే నగరాల్లో హోటల్ బుకింగ్‌లు పెరిగాయి, విమాన ఛార్జీలు పెరిగాయి. ఈ పోటీలో ప్రపంచవ్యాప్తంగా క్రికెట్ అభిమానులు తరలివస్తారని పరిశ్రమ నిపుణులు అంచనా వేస్తున్నారు. పర్యాటక రంగం, ప్రయాణ వ్యాపారాలు ఈ క్రేజ్‌ను క్యాష్ చేసుకునేందుకు సిద్ధంగా ఉన్నాయి.

### ఛాంపియన్స్ ట్రోఫీ 2025 ఫార్మాట్

రెండు వారాల పాటు జరిగే ఈ టోర్నమెంట్‌లో ఎనిమిది జట్లు పాల్గొంటాయి. మొత్తం 15 మ్యాచ్‌లు జరగనున్నాయి.

గ్రూప్ ఏ : భారతదేశం, పాకిస్తాన్, బంగ్లాదేశ్, న్యూజిలాండ్ గ్రూప్ బి : ఆఫ్ఘనిస్తాన్, ఇంగ్లాండ్, ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా ఫిబ్రవరి 19న పాకిస్తాన్-న్యూజిలాండ్ మధ్య కరాచీలో తొలి మ్యాచ్ జరుగుతుంది. భారత్ మాత్రం దుబాయ్‌లోనే తన అన్ని మ్యాచ్‌లు ఆడనుంది.ప్రస్తుతం ఛాంపియన్స్ ట్రోఫీ హైబ్రిడ్ మోడల్‌లో జరుగుతోంది. ప్రారంభంలో ఈ టోర్నమెంట్ పూర్తిగా పాకిస్తాన్‌లో నిర్వహించాలని అనుకున్నప్పటికీ, భారతదేశం పాకిస్తాన్ వెళ్లేందుకు నిరాకరించడంతో, పిసిబి , ఐసీసీ , బీసీసీఐ మధ్య చర్చల అనంతరం వేదికలను మార్చారు. భారత జట్టు మొత్తం మ్యాచ్‌లు దుబాయ్‌లోనే ఆడనుంది.

ఇండియా-పాకిస్తాన్ మ్యాచ్ ఇప్పటికే 100% సామర్థ్యంతో హౌస్‌ఫుల్ అయిన నేపథ్యంలో, ఫ్యాన్స్ సెకండరీ మార్కెట్లు, అధికారిక రీసేల్ ప్లాట్‌ఫామ్‌లను ఆశ్రయిస్తున్నారు. క్రికెట్ ప్రపంచంలోనే అత్యంత ఉత్కంఠభరితమైన ఈ పోరును ప్రత్యక్షంగా వీక్షించాలని అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

2017 ఛాంపియన్స్ ట్రోఫీని గెలిచిన పాకిస్తాన్ డిఫెండింగ్ ఛాంపియన్‌గా పోటీలోకి ప్రవేశిస్తుంది. అప్పటి ఫైనల్లో భారత్‌ను ఓడించి టైటిల్ గెలుచుకున్న పాక్, సొంతగడ్డపై మరోసారి కిరీటం కాపాడుకోవాలని చూస్తోంది.

ఛాంపియన్స్ ట్రోఫీ 2025లో అత్యంత విజయవంతమైన జట్లు భారతదేశం, ఆస్ట్రేలియా జట్లు ఒక్కొక్కటి రెండు సార్లు ఛాంపియన్స్ ట్రోఫీ గెలిచి అత్యంత విజయవంతమైన జట్లుగా నిలిచాయి.భారత అభిమానులు ఇప్పుడు తమ జట్టు మరోసారి ట్రోఫీ గెలుస్తుందా? లేదా 2017 ఫైనల్ దృశ్యం పునరావృతమవుతుందా? అని ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# హృతిక్ రోషన్ సినిమాకి బడ్జెట్ కష్టాలు..
## డైరెక్టర్ షాకింగ్ కామెంట్స్



మూవీ న్యూస్ ,04 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ):భారతీయ చిత్ర పరిశ్రమలో సూపర్ హీరో అనగానే ఎవరికైనా తక్కువ గుర్తొచ్చే సినిమా క్రిష్. హ్యాండ్సమ్ హంక్ హృతిక్ రోషన్ టైటిల్ రోల్ లో తెరకెక్కిన 'క్రిష్' సిరీస్.. సినీ అభిమానులను విపరీతంగా అలరించింది. ఆయన తండ్రి, ప్రముఖ బాలీవుడ్ డైరెక్టర్ రాకేష్ రోషన్ ఈ ఫ్రాంచైజీ తెరకెక్కింది. ఇప్పటి వరకూ వచ్చిన మూడు సినిమాలూ బాక్సాఫీస్ వద్ద బ్లాక్ బస్టర్ విజయాలు సాధించాయి. 'క్రిష్ 4' మూవీ కోసం అందరూ ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఏళ్ళు గడుస్తున్నా నాలుగో భాగం రూపొందలేదు. అయితే ఈ సినిమా లేట్ అవ్వడానికి గల కారణాలను రాకేష్ రోషన్ వెల్లడించారు.

రాకేష్ రోషన్ తాజాగా ఓ ఇంటర్వ్యూలో 'క్రిష్ 4' సినిమాపై మాట్లాడారు. భారీ బడ్జెట్ ఇబ్బందుల కారణంగానే ఆలస్యం అవుతోందని చెప్పారు. కానీ ఖచ్చితంగా ప్రణాళికలో ఉందని.. ఎప్పటికైనా భారీ స్థాయిలో నిర్మించబడుతుందని ధృవీకరించారు. "క్రిష్ నాలుగో పార్ట్ కోసం ఆడియన్స్ చాలా ఏళు ్లగా వేచి చూస్తున్నారు. కానీ ఎంతగా ప్రయత్నించినా భారీ బడ్జెట్ సెట్ అవ్వడం లేదు. అందుకే ఆలస్యం అవుతోంది. క్రిష్-4 చిత్రాన్ని భారీ స్కేల్ లో తీయాల్సి ఉంది. ఒకవేళ నేను బడ్జెట్ తగ్గించాలని చూస్తే, అదొక మామూలు సినిమా అవుతుంది" అని రాకేష్ రోషన్ తెలిపారు.

"ప్రపంచం చాలా చిన్నదిగా మారిపోయింది. ఇప్పుడు అరచేతిలో ఉన్న మొబైల్ ద్వారా మొత్తం తెలిసిపోతోంది. ఈరోజుల్లో పిల్లలు ఎన్నో సూపర్ హీరోల సినిమాలను చూస్తున్నారు. అలాంటప్పుడు మనం చిన్న మిస్టేక్ చేసినా వారి నుంచి విమర్శకులు ఎదుర్కోవాల్సి ఉంటుంది. అందుకే మరిన్ని జాగ్రత్తలు తీసుకొని జాగ్రత్తగా క్రిష్-4 తీయాలి. హాలీవుడ్‌లో మార్వెల్, డీసీ సూపర్ హీరో చిత్రాలను భారీ బడ్జెట్‌తో తెరకెక్కిస్తారు. కానీ ఇక్కడ ఆ లెవల్ లో తీయడం సాధ్యం కాదు. ఎందుకంటే మనం అంత బడ్జెట్ భరించలేం. హాలీవుడ్ లో వెయ్యి కోట్లతో తీసే సినిమాని మనం 4 రూపాయలకు తీయాల్సి ఉంటుంది. అందుకే మనం కథ మీద ఎక్కువ దృష్టి పెట్టాలి. క్రిష్-4లో భారీ యాక్షన్ సీక్వెన్సులు ఉన్నాయి. 10కి బదులుగా 2 లేదా 3 ఉండొచ్చు" అని రాకేష్ రోషన్ చెప్పుకొచ్చారు. 2003లో హృతిక్ రోషన్, ప్రీతి జింటా జంటగా నటించిన 'కోయి మిల్ గయా' చిత్రంతో క్రిష్ ఫ్రాంచైజ్ ప్రారంభమైంది. దీని తర్వాత 2006లో ప్రియాంక చోప్రా హీరోయిన్ గా 'క్రిష్'.. 2013లో ప్రియాంక, కంగనా రనౌత్ లతో 'క్రిష్ 3' సినిమాలు చేసారు. హృతిక్ లాంటి స్టార్ హీరో ఉన్నప్పటికీ, బాలీవుడ్‌లో మోస్ట్ సక్సెస్ ఫుల్ సూపర్ హీరో ఫ్రాంచైజీలలో ఒకటి అయినప్పటికీ 'క్రిష్ 4' సినిమాకి బడ్జెట్ సమస్య తలెత్తుతోందని రాకేష్ రోషన్ చెప్పడం ఆశ్చర్యంగా అనిపిస్తుందని నెటిజన్లు కామెంట్స్ చేస్తున్నారు.

# 'అల వైకుంఠపురములో' తమిళ సినిమా..
## అని చెప్పావేంటి పూజా



మూవీ న్యూస్ ,04 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ):ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, పూజా హెగ్డే జంటగా నటించిన చిత్రం 'అల వైకుంఠపురములో'. త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా ఘన విజయం సాధించింది. 2020 సంక్రాంతికి విడుదలై, బాక్సాఫీస్ దగ్గర భారీ వసూళ్లను రాబట్టింది. రీజనల్ కంటెంట్ తోనే నాన్-బాహుబలి రికార్డులు క్రియేట్ చేసింది. సినిమాలో భాగమైన నటీనటులు, సాంకేతిక నిపుణులు అందరికీ మంచి పేరు తెచ్చిపెట్టింది. అయితే ఇప్పుడు హీరోయిన్ పూజా దీన్ని తెలుగు సినిమాగా కాకుండా, ఒక తమిళ చిత్రంగా పేర్కొనడం సోషల్ మీడియాలో చర్చనీయంగా మారింది.

'దేవా' మూవీ ప్రమోషన్స్ లో భాగంగా పూజా హెగ్డే ఓ మీడియాతో మాట్లాడుతూ.. పాన్ ఇండియా కంటెంట్ యొక్క ప్రాధాన్యత గురించి వివరించింది. "నిజానికి 'అల వైకుంఠపురములో' ఒక తమిళ్ ఫిలిం. అయినప్పటికీ హిందీలోనూ జనాలు ఆదరించారు. 'డీజే దువ్వాడ జగన్నాథం' సినిమాని కూడా హిందీలో చూసారు. కాబట్టి సినిమా బాగుంటే భాషతో సంబంధం లేకుండా జనాలకు రీచ్ అవుతుందని నేను అనుకుంటున్నాను" అని చెప్పింది. అంతా బాగానే ఉంది కానీ, 'అల వైకుంఠపురములో' తమిళ సినిమాగా ఎప్పుడు మారిందని నెటిజన్లు పూజాని ట్రోల్ చేస్తున్నారు. 'అల వైకుంఠపురములో' సినిమాలో బంటూ ప్రేయసిగా, అమూల్య అనే పాత్రలో పూజా హెగ్డే నటించింది. మూవీలో 'బుట్టబొమ్మ' పాట కారణంగా 'టాలీవుడ్ బుట్టబొమ్మ'గా మారిపోయింది. ఇప్పటివరకూ ఆమె కెరీర్ లో ఇదే బిగ్గెస్ట్ హిట్. దీని తర్వాత అనేక క్రేజీ ఆఫర్స్ అమ్మడి తలుపు తట్టాయి. కానీ ఆ రేంజ్ లో హిట్టైన సినిమా లేదు. అలాంటిది ఎప్పటికీ మెమరబుల్ గా నిలిచిపోవాల్సిన సినిమా ఏ భాషలో వచ్చిందనేది కూడా పూజాకి గుర్తు లేకపోవడం ఆశ్చర్యం కలిగిస్తోందని తెలుగు అభిమానులు కామెంట్స్ చేస్తున్నారు. పూజా హెగ్డే ప్రస్తుతం 'రెట్రో' 'జన నాయగన్' అనే రెండు తమిళ చిత్రాల్లో నటిస్తోంది. అందుకే అమ్మడికి అన్నీ తమిళ సినిమాలు అయిపోయాయంటూ నెటిజన్లు విమర్శిస్తున్నారు. మరికొందరు మాత్రం కావాలని ఆమె అలా చెప్పి ఉండదని, పొరపాటును ఏదో కన్ఫ్యూజన్ లో మాట్లాడి ఉంటుందని అభిప్రాయపడుతున్నారు. ఈ విషయాన్ని మరీ పెద్దదిగా చేసి చూడాల్సిన అవసరం లేదంటూ సపోర్టుగా నిలుస్తున్నారు. ఏదేమైనా తనని స్టార్ హీరోయిన్ ని చేసిన తెలుగు సినిమాని మర్చిపోవడం ఏంటనే కామెంట్స్ ఎక్కువగా కనిపిస్తున్నాయి.

# అభిమానులకు ఎన్టీఆర్ విజ్ఞప్తి..
## ఎవ్వరూ అలాంటివి చేయొద్దన్న తారక్

మూవీ న్యూస్ ,04 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ):మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్ రీసెంట్ గా దేవర సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చారు. కొరటాల శివ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా సంచలన విజయం



సొంతం చేసుకుంది. ఈ సినిమాతో ఎన్టీఆర్ ఫ్యాన్స్ ఫుల్ ఖుష్ అవుతున్నారు. ఆర్ఆర్ఆర్ సినిమాతో పాన్ ఇండియా హీరోగా మారిన ఎన్టీఆర్.. ఇప్పుడు కొరటాల దేవరతో మరోసారి పాన్ ఇండియా హిట్ అందుకున్నాడు. తనపై అభిమానులు చూపిస్తున్న అపారమైన ప్రేమ, గౌరవానికి జూనియర్ ఎన్టీఆర్ హృదయపూర్వకంగా కృతజ్ఞతలు తెలియజేశారు.తనను కలుసుకోవాలని ఎదురు చూస్తున్న అభిమానుల ఆసక్తిని అర్థం చేసుకుని, త్వరలో ఒక సజావుగా ఏర్పాటు చేసిన సమావేశంలో వ్యక్తిగతంగా వారిని కలుసుకోవాలని నిర్ణయించుకున్నారు తారక్. ఈ కార్యక్రమాన్ని అన్ని అనుమతులు పొందుతూ, పోలీస్ డిపార్ట్‌మెంట్, సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుని శాంతి భద్రతల సమస్యలు రాకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఇంత పెద్ద సమావేశం నిర్వహించటానికి కొంత సమయం అవసరం అవుతుంది కాబట్టి, అభిమానులు ఓర్పుగా ఉండాలని కోరారు ఎన్టీఆర్.
ఈ నేపథ్యంలో, అభిమానులు తనను కలుసుకోవడానికి పాదయాత్ర వంటివి చేయరాదని జూనియర్ ఎన్టీఆర్ విజ్ఞప్తి చేస్తున్నారు. తన అభిమానుల ఆనందమే కాదు, వారి సంక్షేమం కూడా తనకు అత్యంత ప్రధానం అని ఆయన మరోసారి స్పష్టం చేశారు.

# ఊహించని లుక్ లో సమంత



మూవీ న్యూస్ ,04 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ):ఏమాయ చేశావే సినిమాతో కుర్రకారు మనసు దోచేసుకున్న ముద్దుగుమ్మ సమంత. ఈ అమ్మడు మొదటి సినిమాతోనే బ్లాక్ బస్టర్ హిట్ తన ఖాతాలో వేసుకొని, వరస సినిమాలతో టాలీవుడ్‌నే షేక్ చేసిందని చెప్పవచ్చు. వరసగా స్టార్ హీరోల సినిమాల్లో అవకాశాలు దక్కించుకుంటూ, టాలీవుడ్ నెంబర్ వన్ హీరోయిన్‌గా ఓ వెలుగు వెలిగింది. కెరీర్ మంచి ఫామ్‌లో ఉన్న సమయంలోనే సమంత ఎన్నో సమస్యలు ఎదుర్కోవాల్సి వచ్చింది. అనారోగ్య సమస్యలతో ఈ బ్యూటీ చాలా రోజుల పాటు సినిమాలకు బ్రేక్ ఇచ్చి, రెస్ట్ తీసుకున్న విషయం తెలిసిందే. ఇప్పుడిప్పుడే ఈ ముద్దుగుమ్మ తన హెల్త్ ప్రాబ్లమ్స్ నుంచి బయటపడి, మళ్లీ సినిమాలపై ఫోకస్ చేసింది. మా ఇంటి బంగారం లాంటి ప్రాజెక్ట్స్‌లో బిజీగా ఉంది.ఇక ఈ మధ్య సమంత నా అభిమానుల కోసం నేను సినిమాలు చేస్తాను. కానీ ఛాలెంజింగ్‌గా ఉన్న పాత్రలనే ఎంచుకుంటాను అని తెలిపిన విషయం తెలిసిందే. అయితే తాజాగా సామ్ స్టన్నింగ్ లుక్‌లో దర్శనం ఇచ్చింది. ఈ బ్యూటీ తన ఇన్‌స్టాలో షేర్ చేసిన ఫొటోల్లో అచ్చం అబ్బాయిలా కనిపిస్తుంది. ఇందులో సమంత చాలా అందంగా ఉంది. దీంతో ఈ ఫొటోలపై పలువురు పలు విధాలుగా కామెంట్స్ చేస్తున్నారు. కొందరు సూపర్ అంటే మరికొందరు ఈ బ్యూటీ హాలీవుడ్ చెక్కేస్తుంది అందుకే ఇలా రెడీ అయ్యిందని అంటున్నారు.

Printed, Published and owned by ----------------------, Printed at ----------------------, H.No. 00000000, ######, #####, 3#####, ##### #####. Telangana State,
Published from ##### #####, H.No. 000000000, ##### #####, ##### #####, ##### ##### ##### #####. ##### #####, Telangana State. Editor: asfghjklqwertt, RNI. No. APTEL/0000/00000, Cell: 1234567890, 0987654321 Email: sample@company.com